ప్రజాశక్తి
విజయనగరం

ఆదివారం
జనవరి 7
2018
పేజీలు 12



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షన్ సాధన సమితి నాయకులు

సిపిఎస్ రద్దు కోరుతూ

9న తాలూకా కేంద్రాల్లో ధర్నాలు

ఫిబ్రవరి 10న కలెక్టరేట్ వద్ద ధర్నా
పెన్షన్ సాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగుల సామాజిక భద్రతకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9తేదీన అన్ని తాలూకా కేంద్రాల వద్ద ధర్నాలు చేయనున్నట్లు పెన్షన్ సాధన సమితి జిల్లా కన్వీనర్ బిహెచ్ఆర్ ప్రభూజి, కె.శేషగిరి, ఆర్‌వి రమణమూర్తి, డి.ఈశ్వరరరావు, పెద్దింటి అప్పారావు తెలిపారు. శనివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ అనేది ఒక సామాజిక భద్రతని, దాదాపు మూడు దశాబ్దాలు పాటు తన శక్తియుక్తులను ధారపోసి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రిటైరైన తర్వాత ఇచ్చే పెన్షన్‌ను కార్పోరేటు శక్తుల చేతుల్లో పెట్టి భద్రత లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా ఇప్పటికే అనేక ఉద్యోగ సంఘాలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాలేదన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎస్‌ను రద్దు చేయించి పాత పెన్షన్ విధానం అమలు కోసం రాష్ట్రంలోను, జిల్లాలోను పెన్షన్ సాధన సమితి ఏర్పాటైందని తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేసే వరకు, పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకుపోరాటం ఆగదన్నారు. మరోవైపు చంద్రబాబు నాయుడు సిపిఎస్ విధానం తన చేతుల్లో లేదని చెప్పడం సరి కాదన్నారు. తక్షణమే మిగతా 4లో

దళితులకు సిపిఎం, సిపిఐ నాయకుల పరామర్శ

- దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్
- ఎస్‌పి పాలరాజుకు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డెంకాడ మండలం మోదవలసలో టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడి జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్య నారాయణ, పి.కామేశ్వరరావు శనివారం పరామర్శించారు. మరోవైపు శుక్రవారం రాత్రి దళితుల ఇంటిపై టిడిపి కార్యకర్తలు దాడి చేసి, ఇంట్లో సామాగ్రిని ధ్వంసం చేశారు. మరో ఇద్దరిని గాయపరిచారు. దళితులపై దాడిచేసిన తెలుగుదేశం నాయకుడు (ఎంపిటిసి భర్త) కాగితాల సత్యనారాయణ, ఎర్నింటి శ్రీను, ఎర్నింటి రాము, ముని పైడయ్యలతోపాటు వారితోపాటు వచ్చిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. జన్మభూమి సభకు వెళ్తున్న మిగతా 4లో



మోదవలసలో దళితులతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు



దళిత నాయకుడు అప్పన్న ఇంట్లో ధ్వంసం చేసిన కుర్చీలు

దళిత నాయకుడి ఇంటిపై దాడి

ఇద్దరికి గాయాలు

డెంకాడ : మండలంలోని మోదవలసలో దళితులపై టిడిపి కార్యకర్తల దాడులు శుక్రవారం రాత్రి వరకూ కొనసాగాయి. సాయంత్రం దళిత నాయకుడు గంద్రేటి అప్పన్న ఇంటిపై 20 మంది టిడిపి కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఇంట్లో ఉన్న కుర్చీలు, కిటికీలను పగులగొట్టారు. అడ్డొచ్చిన దళిత నాయకుడు అప్పన్నను, ఆయన కుమార్తెయిన నెల రోజుల బాలింతపైనా దాడి చేసి కొట్టారు. ఇంట్లో ఉన్న సామాగ్రి, బీరువాలను పగులగొట్టారు. గాయపడిన అప్పన్న, ఆయన కుమార్తె జిల్లాకేంద్రా సుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారందరినీ వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, అవనాపు విజయ్, గ్రామసర్పంచ్ కనకల రామారావు, నాయకులు బోను అప్పలనాయుడు, ఎర్నింటి కృష్ణ తదితరులు పరామర్శించారు. అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.



సంగీత దర్శకుడు కోటి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గీత

4లో


ఆదిభట్ల హరికథా సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

నిరాశపర్చిన సిఎం పర్యటన

కొత్త హామీల ఊసే లేదు... పాత హామీల అమలూ లేదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన ఆద్యంతం నిరాశపర్చింది. జిల్లా అభివృద్ధికి కొత్తగా హామీలేవీ ఇవ్వలేదు సరికదా పాత హామీల అమలు గురించీ ప్రస్తావించలేదు. 'పాడిందే పాట అన్నట్టుగా గతంలో ఇచ్చిన హామీలనే మళ్లీ వినిపించారు. విజయనగరం జిల్లావాసులు నీతి, నిజాయతీ గలవారు... నదులు అనుసంధానం చేస్తాం... ఎన్నో వనరులు ఉన్నాయి... వాటన్నింటినీ వినియోగించి జిల్లాను అభివృద్ధి చేస్తాం' అంటూ గతం కొన్నేళ్లగా చెబుతున్న మాటలే మళ్లీ వల్లెవేస్తున్నారు. పైగా ఎక్కువ మంది పిల్లల్ని కనాలని, బాగా చదివించుకోవాలని, విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఉచిత సలహా ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ విద్య అందించడమే తన ధ్యేయమంటూ నొక్కి వక్కానించారు. కానీ, ఆయన మాటలకు, చేతలకు చాలా తేడా కనిపిస్తోంది. భవిష్యత్తులో మానవ వనరులను దృష్టిలోపెట్టుకుని ఎక్కువ మంది పిల్లల్ని కనమంటూ సలహాలిస్తున్న చంద్రబాబు వారి పోషణకు అనుగుణంగా కొనుగోలు



శక్తిని పెంచడం లేదు. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాకు కొత్త పరిశ్రమలేమీ రాలేదు సరికదా జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో, 12వేల కుటుంబాల వారు జీవనోపాధి కోల్పోయారు. ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవడం వల్ల పేద రైతులు వ్యవసాయ మిగతా 4లో

అర్హులందరికీ పథకాలు

జన్మభూమి రాష్ట్ర పరిశీలకులు సాంబశివరావు

కొమరాడ : జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి చేస్తామని రాష్ట్ర పరిశీలకులు కె.సాంబశివరావు అన్నారు. మండలంలోని అర్తాం, గంగరేగువలస, కోటిపాం, గుమడ గ్రామాల్లో జన్మభూమి-మాఊరు సభలు శనివారం నిర్వహించారు. గంగరేగువలసలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రేషన్‌కార్డులు, పింఛన్లు, ఎన్‌టిఆర్ గృహాలు, రుణాలు ఇతర పథకాలను అమలు చేశారన్నారు. అధికారులు ప్రజలకు పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐటిడిఎ పిఒ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే కోట్లాది రూపాయలతో రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గిరిజన విద్యార్థులు, యువత కోసం ప్రత్యేక పథకాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేశారు. కార్యక్రమాల్లో జన్మభూమి ప్రత్యేకాధికారి భాస్కరరావు, ఎంపిడిఒ రామారావు, తహశీల్దార్ రాజకుమారి, కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు మరిశర్ల సత్యనారాయణ, టిడిపి నాయకులు దేవకోటి వెంకటనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలపై ప్రచారం

కొమరాడ : పార్వతీపురం పట్టణంలోని జరగనున్న సిపిఎం 8వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కె.సాంబమూర్తి తెలిపారు. శనివారం కూనేరు సంతలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి గిరిజనులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో పార్వతీపురంలోని పాతబస్టాండ్‌లో మహాసభలు జరుగుతాయని, మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, కార్యకర్తలు ఉన్నారు.

కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

కురుపాం : కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు కుల, మతాలకు అతీతంగా ప్రజలకు అందించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సన్యాసిరాజు అన్నారు. స్థానిక గౌడవీధిలో శనివారం బిజెపి శక్తి కేంద్ర బాధ్యుల సమావేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.జయరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సన్యాసిరాజు మాట్లాడుతున్న రానున్న ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పి.జగన్మోహనరావు, జిల్లా పరిశీలకులు సత్యమూర్తి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులకు పండగ బోనస్

జియ్యమ్మవలస : పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారిని అన్ని విధాలా ఆదుకొనేందుకు విశాఖ డెయిరీ ప్రతి ఏటా పాడి రైతులు పాలశాతాన్ని బట్టి సంక్రాంతి పండగ సందర్భంగా బోనస్‌ను ఇస్తుందని ఏరియా మేనేజర్ రెడ్డి ప్రసాద్ తెలిపారు. జియ్యమ్మవలసలో 42మంది రైతులకు రూ.48,936, డంగభద్రలో 14మంది పాడిరైతులకు రూ.21,573 బోనస్ అందించామన్నారు. ఈ బోనస్ 2016 ఏప్రిల్ నుంచి 2017 మార్చి వరకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు ఎ.వెంకటనాయుడు, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, శంకరరావు పాల్గొన్నారు.



బోనస్‌ను అందజేస్తున్న డెయిరీ మేనేజర్ వరప్రసాద్



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సిపిఎం నాయకులు శ్రీనివాసరావు

సమస్యలు పరిష్కరించని సభలెందుకు?

సారిక గ్రామంలో అధికారులను నిలదీత

ప్రజాశక్తి-సాలూరు

ప్రజా సమస్యలు పరిష్కరించని జన్మభూమి సభలెందుకని సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, బిజెపి గిరిజన మోర్చా నాయకులు ఎం.అయోధ్య ప్రశ్నించారు. శనివారం సారికలో ఎంపిడిఒ రాయప్ప ఆధ్వర్యాన జన్మభూమి సభ జరిగింది. అన్ సర్వేభూముల సర్వే చేయలేదని, గంజాయిభద్ర, రహదారి అసంపూర్తిగా వదిలేశారని, గిరిజన రైతులకు పంట నష్టం అందడం నిలదీశారు. పంచాయతీ కార్యాలయం నిర్మించి ఐదేళ్లవుతున్నా ఇంత వరకూ పూర్తి చేయలేని సర్పంచ్ జి.సత్యవతి చెప్పారు.కార్యక్రమంలో మండల జన్మభూమి కమిటీ సభ్యుడు సిహెచ్ గోవిందరావు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని తోణాం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి -మాఊరు కార్యక్రమంలో సాలూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్‌పి భంజ్‌దేవ్ పాల్గొన్నారు. తోణాం పంచాయతీలకు సమీప గిరిశిఖర పంచాయతీలైనా పగులు చెన్నారు, పట్టు చెన్నూరులకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టు చెన్నారు పంచాయతీ సర్పంచ్ కొండపల్లి పైడి తల్లమ్మ, పగులు చెన్నారు సర్పంచ్ కూనేటి గింద, తోణాం సర్పంచ్ మువ్వల ఆదయ్య, ఎంపిపి బోను ఈశ్వరమ్మ, మండల ప్రత్యేకాధికారి ఎన్.లక్షుంనాయుడు, ఎంపిడిఒ శివరామప్ప పాల్గొన్నారు.

అర్హుల కోసమే సంక్షేమ పథకాలు

జెడ్‌పి చైర్‌పర్సన్ స్వాతీరాణి

ప్రజాశక్తి-సాలూరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి చెప్పారు. శనివారం పట్టణంలోని 13, 15 వార్డులకు సంబంధించిన జన్మభూమి సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ఎవరో చనిపోయి రూ. 2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.విజయకుమారి, కమిషనర్ ఎంఎంనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, జన్మభూమి కమిటీ సభ్యుడు జి.మాదవరావు, డిఇ సుధాకర్, టిపిఒ అమర్‌నాద్ పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని నారన్నాయుడువలస, వంతరాంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. వంతరాంలో జరిగిన సభకు పార్వతీపురం ఎమ్మెల్యే బి.చిరంజీవులు హాజరయ్యారు. కెజిబివి పాఠశాల భవనానికి రూ. 65లక్షలు, పెదవంతరాం నుంచి చినవంతరాం వరకు రోడ్డు మరమ్మతులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి పార్వతి, జెడ్‌పిటిసి రాధ, ఎంపిడిఒ ఎస్.సింహాచలం, అధికారులు హాజరయ్యారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని జమదాలలో శనివారం అభివృద్ధి పనులను జెడ్‌పిటిసి గొట్టాపు గౌరీశ్వరి ప్రారంభించారు. ఆర్అండ్‌బి రోడ్ నుంచి శివాలయం వరకు రూ.5లక్షలు ఎడిఎఫ్ నిధులతో నిర్మించబోయే సిమెంట్ రహదారిని సర్పంచ్ దాసరి జ్యోతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, గ్రామస్తులంతా వ్యక్తిగత మరుగుదొడ్ల పనులు వేగవంతం చేసి మండలంలోని ఆదర్శ గ్రామంగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి మూడడ్ల సింహాచలం, పిఆర్ జెఇ శ్రీనివాసరావు, జిల్లా టిడిపి కార్యదర్శి జి.వెంకటనాయుడు, మండలపార్టీ అధ్యక్షులు జి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులు, వినతులు శాఖల వారీగా ఆన్‌లైన్ చేసి, నివేదికలు పంపించాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన తహశీల్దార్, ఎంపిడిఒలతో జన్మభూమి కార్యక్రమంలో సమీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. ముగింపు ఉత్సవాలకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అజరఫీజాన్, ఎంపిడిఒ కె.కృష్ణారావు మండల స్థాయి ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలిటౌన్

ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లాకు గానీ, నియోజక వర్గానికి గానీ ఒరిగేదేమీ లేదని కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రభుత్వ విప్ శంబంగి చినప్పలనాయుడు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ హామీలు గుప్పించారు గానీ, హామీలను నెరవేర్చడంలో ఎంత చిత్తశుద్ధితో పని చేస్తారో చూడాలన్నారు. స్థానిక సమస్యలు ప్రస్తావించని ముఖ్యమంత్రికి జ్యూట్ మిల్లులు మూతపడడం, రైతు, మహిళా సమస్యలు తెలియడం లేదన్నారు. కార్మిక సమస్యలపై జిల్లా మంత్రి, కార్మిక శాఖామంత్రితో కార్మిక సంఘాలు చర్చలు జరిపినా మిల్లులు మూత పడి మూడేళ్లయినా తెరిపించని ముఖ్యమంత్రి, మంత్రులు వందల కోట్లు ఇస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసినప్పటికీ వారి ఖాతాల్లో డబ్బులు పడక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కె.శ్రీను, టి.సత్యనారాయణ, ఎ.రమణమూర్తి, జిఎల్ నాయుడు పాల్గొన్నారు.

'సారిపల్లి' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్య, వైద్యం కోసం సారిపల్లి ట్రస్టు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కొత్తవలస ఏడో వార్డు కొత్తపోలమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సారిపల్లి ట్రస్టు వారు రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను ట్రస్టు చైర్మన్ సారిపల్లి దాలిమృత్యుంజయరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గోవిందరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ పాఠశాలలో వసతి సౌకర్యంలేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్రస్టును ఆశ్రయించగా, స్పందించి ఈ గదులను నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఈ ట్రస్టు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, టిఆర్ఎంఎం బాలికోన్నత పాఠశాల, తదితర పాఠశాలలకు కార్పొరేట్ స్థాయిలో భవన సదుపాయాలు కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. ఈ ట్రస్టు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.జయప్రకాష్‌నారాయణ, కౌన్సిల్ సభ్యులు కోమటి వెంకటరావు, బార్నాల సీతారాం, కోలా హేమలత, టిడిపి పట్టణ అధ్యక్షులు కోలా వెంకటరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు : ట్రస్టు చైర్మన్ మృత్యుంజయరావు



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

సారిపల్లి ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సరస్వతి డిఎంఆర్ సారిపల్లి ట్రస్టు చైర్మన్ దాలి మృత్యుంతజయరావు అన్నారు. శనివారం స్థానిక కుసుమగుడ్డివారివీధిలోగల ధ్యానమందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ తల్లి రత్నాలమ్మ పేద విద్యార్థులకు చదువు, వైద్యం చేసేవారని, ఆమె జ్ఞాపకార్థంగా నాబడి-నాఊరు కార్యక్రమం ద్వారా పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు శరీరదారుఢ్యానికి ఉపయోగపడే క్రీడామైదానం, రన్నింగ్, వాకింగ్‌ట్రాక్, విద్యుద్దీకరణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో ట్రస్టు ద్వారా మరెన్నో ప్రజా సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి 3
ఆదివారం 7 జనవరి 2018

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి-చీపురుపల్లి

నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో వెనుకాడేది లేదని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తెలిపారు. శనివారం మండలంతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభంతో పాటు శంకుస్థాపనలను ఆమె చేపట్టారు. పట్టణంలో రెడ్డిపేటలో రూ.20 లక్షలతో నిర్మాణం జరిగిన త్రాగు నీటి ట్యాంకును ప్రారంభించారు. ఆకులపేటలో రూ.20 లక్షల నిధులతో నిర్మాణం జరిగిన త్రాగు నీటి ట్యాంకుతో పాటు ఆంజనేయపురంలో రూ.50 లక్షల నిధులతో నిర్మాణం చేయనున్న నీళ్ల ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. జి.అగ్రహారంలో రూ.18 లక్షలతో నిర్మాణం చేసిన సామూహిక మరుగుదొడ్ల భవనాన్ని ప్రారంభించారు. ఆర్ఇసిఎస్ కార్యాలయం ఆవరణలో రెస్కో నిధులు రూ.32 లక్షల వ్యయంతో గొడౌన్ నిర్మాణ పనులను, రూ.25 లక్షల నిధులతో సెక్షన్ కార్యాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 106 పంచాయితీలలో అన్ని ఇళ్లకు రూ.69 కోట్లతో ఇంటింటి కుళాయి పథకానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నియోజకవర్గంలో 19 త్రాగు నీటి ట్యాంకులు నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. వీటన్నింటినీ ప్రజలకు అంకితం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రౌతు కాంతమ్మ, జెడ్పిటిసి మీసాల వరహాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, మండల తెలుగుదేశం అధ్యక్షులు రౌతు కామునాయుడు, ఆర్ఇసిఎస్ ఛైర్మన్ దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ఎంపిటిసిలు ఆరతి సాహు, టివివి శ్రీదేవి, కర్రోతు రమణ, అడ్డూరి కృష్ణ, గవిడి నాగరాజు,పతివాడ శ్రీను, సతివాడ ఆదిబాబు, పట్నాన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ ధరలు (నిన్నటి రేట్లు, కిలోకు)



కూరగాయలు	ధర (రూపాయల్లో)
వంగ (తెలుపు)	20
వంగ (రవ్వ)	27
వంగ (నలుపు)	16
టమాటా దేశవాళి	11
టమాటా హైబ్రిడ్	11
బెండ	35
కాకర	24
బీర	38
క్యాబేజీ	18
పొడుగు చిక్కుడు	24
క్యారెట్	28
దొండ	25
బీట్‌రూట్	26
ఉల్లిపాయలు	42
బంగాళాదుంపలు	8
అల్లం	35
పచ్చిమిర్చి	30
వెల్లుల్లి	36
గోరుచిక్కుడు	22
మునక్కాడలు	65
కాప్సికమ్	40
కీరదోస	22
నక్కదోస	18
కంద	30
చామ	27
ఫ్రెంచ్ బీన్స్	28
పొటల్స్	28
అకాకర	28

నర్సింగరావు ఆశయ సాధనకు కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిఎల్ నర్సింగరావు ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి జి.పాలరాజు తెలిపారు. ఎంఆర్ న్యాయ కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపల్, జిల్లా న్యాయ సహాయక సభ్యులు బిఎల్ నర్సింగరావు సంస్మరణ సభను శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచితనానికి మారుపేరు నర్సింగరావని తెలిపారు. ఆయన నేడు మన మధ్య లేనప్పటికీ ఈ సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం పిటిసి ప్రిన్సిపల్ రాజ శిఖామణి మాట్లాడుతూ బిఎల్



నర్సింగరావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి పాలరాజు

నర్సింగరావుతో తనకు పరిచయం తక్కువే అయినప్పటికీ ఆయన అకాల మరణంతో ఒక ఉన్నతమైన వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు సెస్‌పి వెవి రమణ, వెంకటేశ్వరరావు, జి.రామ్మోహనరావు, రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే



గరివిడిలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని 9,19,29 వార్డుల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. 19 వార్డులోని జొన్నగుడ్డిలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీని అభివృద్ధి చేస్తూ సులభంగా మెరుగైన పద్ధతుల్లో ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. అనంతరం పెన్షన్, రేషన్ కార్డులు కూపన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలరు కంతా మీనాకుమారి, వైస్ ఛైర్మన్ కనకల మురళిమోహన్, 22 వార్డు కౌన్సిలర్ కరణం విజయకుమారి, తెలుగుదేశం నాయకులు ఐవిపి రాజు, వివిఎస్ ప్రసాద్, సైలాడ త్రినాధరావు, 30 వార్డు కౌన్సిలర్ మైలిపిల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : గ్రామాలాభివృద్ధి తమ ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి పి.సింహాచలం తెలిపారు. మండలంలోని కుమరాం, కె.పాలవలసలో తహశీల్దార్ సుభాష్‌బాబు ఆధ్వర్యాన శనివారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పి.బలరాం పాల్గొన్నారు.

భోగాపురం : జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని శనివారం మండలంలోని రావడలో నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలను గ్రామస్తులు తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కర్రోతు బంగార్రాజు, ఎఎంసి ఛైర్మన్ కె.సత్యనారాయణ, నాయకులు సూర్యనారాయణ, ఎ.పైడినాయుడు పాల్గొన్నారు.

గాయపడిన దళితులకు వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మోదవలస దళితులపై దాడి చేసిన అధికార పార్టీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని జిల్లా వైసిపి సమన్వకర్త మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యం పొందుతున్న దళితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదవలస జన్మభూమి సభకు వెళ్తున్న దళితులపై దాడి చేసి గాయపర్చడం, బాలింతలను కూడా చూడకుండా మహిళలపై దాడులు చేయడం తెలుగుదేశం పాలన అరాచానికి నిదర్శనమన్నారు. దళితులకు వైసిపి అండగా ఉంటుందని తక్షణమే కలెక్టర్, ఎస్పీ కలుగుజేసుకొని దళితులపై దాడికి పాల్పడినవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, అంభళ్ల శ్రీరాములునాయుడు, పతివాడ అప్పలనాయుడు, ఎంఎల్ఎన్ రాజు, మోదవలస సర్పంచి కనకల రామారావు, బంటుపల్లి వాసుదేవరావు, ఓమ్మిశ్రీను, రెడ్డి వెంకటేష్, పతివాడ సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

సిఎం పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమిటి..?

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బొబ్బిలిలో శుక్రవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమిటని వైసిపి జిల్లా సమన్వకర్త మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం స్థానిక సత్య లాడ్జిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు బొబ్బిలిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో జిల్లా అభివృద్ధికి ఆయన చేపడుతున్న చర్యలేమి తీసుకున్నారో ఎందుకు చెప్పలేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలు ప్రభుత్వ వైద్యకళాశాల, గిరిజన యూనివర్శిటీ, గుర్ల జూనియర్ కాలేజిని డిగ్రీ కాలేజిగా చేస్తామని తదితర హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలు ఏమయ్యాయని వాటి గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. కేవలం జన్మభూమి పేరుతో ప్రజా ధన్నాన్ని వృథా చేయడానికి చూస్తున్నారు తప్ప ఈ సభలుతో ఒరిగిందేమిటిలేదన్నారు. మరోవైపు భోగాపురం విమానాశ్రయం పనులు జరుగుతున్నాయని చంద్రబాబునాయుడు చెబుతుంటే దాని గురించి ఆయనకు పూర్తిగా తెలిసినట్లు కనిపించడం లేదన్నారు. ఇప్పటి వరకు కనీసం ఇటుక బెడ్డ పని కూడా జరగలేదన్నారు. జిల్లాలో పేదలు అనేక మంది ఉన్నారన్నారు. నాణ్యమైన వైద్యం అందక, లక్షలాది రూపాయిలు ఖర్చు చేయలేక మరణిస్తున్నారని ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చాలా అవసరమన్నారు. వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చిన ప్రభుత్వం నేడు దానిని ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పలేదన్నారు. జిల్లా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేని ఎమ్మెల్యేలు జిల్లాలో ఉండడంతో జిల్లాకు అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, కౌన్సిలర్లు పిలకా దేవి,గంటా చినతల్లి పాల్గొన్నారు.



ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన పోలీసు హెల్ప్‌డెస్క్ వెనుకభాగంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆరో వార్డు గిజబకాలనీకి చెందిన మరడాన సాంబమూర్తి(65) గత కొన్ని రోజులుగా ఆర్టీసి కాంప్లెక్స్ పరిసరాల్లో యాచకం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు కొంతమేరకు మతిస్థిమితం కూడా ఉండేదని కాదని భార్య సరోజనమ్మ తెలిపింది. ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి ఉంచినప్పటికీ మళ్లీ కాంప్లెక్స్ పరిసరాలకు చేరుకుని తిరిగేవాడని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సాంబమూర్తి మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు సేకరించి కుటుంబీకులకు తెలియజేశారు. సాయంత్రం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కరణలు నిర్వహించారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

మెట్లపై నుంచి జారిపడి బాలుడికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మెట్లపై నుంచి జారిపడి రెండేళ్ల బాలునికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆరో వార్డు నవిరికాలనీకి చెందిన నేరడబిల్లి రియాన్ తన ఇంటి మేడపై ఆడుకుంటుండగా మేడమెట్లపై నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో రియాన్ తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు.

జెడ్‌పిటిసి మాజీ సభ్యులు హరినాయుడు మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, మాజీ ఆర్ఐపిఎస్ ఛైర్మన్ మంత్రి హరినాయుడు(78) శనివారం అనారోగ్యంతో తన ఇంటి వద్ద మృతిచెందారు. హరినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈయన మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, కెంబూరి రామ్మోహనరావు, టి.సరస్వతమ్మ, టి.వెంకటరత్నం, గజపతినగరం ఎమ్మెల్యే కెఎ నాయుడుకు సుపరిచితులు. గ్రామ మునసుబుగా పనిచేసి తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాల్లో చేరారు. ఆర్ఐసిఎస్ ఛైర్మన్‌గా, జెడ్‌పిటిసి సభ్యునిగా మెరుగైన సేవలందజేశారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి-గరివిడి

సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం స్థానిక కెజిబివి పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యమ్రకంలో పాఠశాల ప్రత్యేకాధికారి జానకి, యుటిఎఫ్ నాయకులు జె.పద్మజ, ఎం.రఘు, బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళర్పిస్తున్న నాయకులు

మొదటి పేజీ తరువాయి

దళితులకు సిపిఎం, సిపిఐ నాయకుల పరామర్శ

దళితులపై శుక్రవారం టిడిపి కార్యకర్తలు దళితులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో గాయపడి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న గండ్రేటి గణేష్, అప్పన్న, గండ్రేటి గౌరి, పూడికల బంగార్రాజు, మహిళలు మైలపిల్లి పైడిరాజు, పోలిపల్లి కాంతి, రెల్ల పైడిరాజును శనివారం సిపిఎం, సిపిఐ నాయకులు పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోదవలస వెళ్లి దళిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వారు దళితులనుద్దేశించి మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ అరాచక పాలన సాగుతుందన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా దళితుల భూములను కాజేయడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. గ్రామంలో దళితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం సర్వేనెంబర్ 186లో 12ఎకరాలు భూమిని గతంలో ఇచ్చిందని, ఆ భూమిని ఎలాగైనా లాగేసుకోవాలనే ఉద్దేశంతోనే దళితులపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు.

దళితుల ఇళ్లకొచ్చి కొట్టడమే కాకుండా, మహిళలని చూడకుండా, బాలింతపై దాడి చేయడం హేయమైన చర్యన్నారు. పోలీసులు ఉంటుండగానే దళితులపై దాడి చేస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నించారు. దళితులు ఒంటరి వారు కాదని, వారి వెంట కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు అండగా ఉంటాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా దళితులను, ప్రజా సంఘాల నాయకులను ఐక్యం చేసి ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని అన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన ఎంపిటిసి భర్త కానితాల సత్యన్నారాయణ, ఎర్రింటి శ్రీను, ఎర్రింటి రాము, ముని పైడియ్యలతోపాటు దాడిలో పాల్గొన్న వారిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్పిని కలిసి సమస్యను వివరించారు. దళితులను పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన రావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్ ఉన్నారు.

నిరాశపర్చిన సిఎం పర్యటన

కార్మికులు గానూ, వ్యవసాయ కార్మికులు వలసకూలీలగానూ మారిపోయారు. ఇక లక్షల సంఖ్యలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో సతమతమౌతున్నారు. జిల్లా తలసరి ఆదాయం రూ.86కు పరిమితం కావడమే ఇందుకు తార్కాణం. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లల్ని పోషించు కోలేకపోతుంటే ఎక్కువమంది పిల్లల్నికని ఎలా పోషిస్తామని పలువురు ప్రశ్నిస్తున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా జిల్లా సుమారు 200 స్కూళ్లను ప్రభుత్వం ఎత్తివేసిన విషయం విధితమే. దీంతో, ఆయా గ్రామాల్లోని పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లకు పంపలేక, స్థానికంగా బడిలేక తల్లిదండ్రులు చదువు మాన్పిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అందరూ ఎలా చదివించు కోగలుగుతారనే ప్రశ్న తలెత్తుతోంది. దీనికి సిఎం సారు పెద్ద కట్టుకథే చెప్పారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లగా మార్పు చేసి నాణ్యమైన విద్య చెబుతున్నట్లు వక్కాణించారు. గడిచిన మూడేళ్లలో ఎత్తివేసిన హాస్టళ్ల గురించి ప్రస్తావించలేదు. ఇక మంచి మార్కులు సాధించినవారందర్నీ కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చిన బాబు అదే తరహాలో ప్రభుత్వ కాలేజీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్నది విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావుల ప్రశ్న. నదులు అనుసంధానం చేస్తామన్నది ఇప్పటి మాటకాదు. అధికారంలోకి వచ్చిన నుంచీ చెబుతున్నదే. కానీ, ఆచరణలో అటువంటి ప్రయత్నం జరగలేదు. సహజ వనరులను ఉపయోగించి జిల్లాను అభివృద్ధి పథకంలో నడిపిస్తామన్న చంద్రబాబు ఎంతో మేలు చేకూరే జంఝావతి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులతోపాటు జీవగడ్డలపై తలపెట్టిన మినీ రిజర్వాయర్ల గురించి పట్టించుకోలేదు. ఇక గిరిజనవర్శిటీ, పశువైద్యకళాశాల, ఉద్యనవన కళాశాల హామీలు ఇప్పటివి కాదు. వచ్చిన ప్రతిసారీ ఈ హామీలు పునరావృతమౌతూనే ఉన్నాయి. వీటికితోడు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక హామీలేవీ ఇవ్వకపోవడంతో ప్రజానీకం తీవ్ర నిరాశ, నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు. బాబు వచ్చినప్పుడల్లా నీతివాక్యాలు, సూక్తులు, సినిమా డైలాగులు తప్ప చేసిందేమీ కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

9న తాలూకా కేంద్రాల్లో ధర్నాలు

సిపిఎస్‌ను రద్దు చేసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అందుకోసం ఈనెల 9న అన్ని తాలూకా కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తామని, తర్వాత ఫిబ్రవరి 10న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించి రద్దు చేయకుంటే భవిష్యత్‌లో మరింత పెద్దఎత్తున పోరాడుతామని తెలిపారు. సమావేశంలో సాధన సమితి నాయకులు కె.సురేష్, రామరాజు, హరి, చక్రధరరావు, కె.నారాయణరావు, కె.శ్రీనివాసరావు, సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

రెండు పశువులు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని సంత గైరంపేటలో జానా అప్పలస్వామి అనే రైతు పశువుల పాక శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ కాలిపోయి రెండు చూడి ఆవులు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షా20వేలు ఉంటుందని అప్పలస్వామి తెలిపారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లానని తిరిగి బయల్దేరే సమయంలో మీ పాక కాలిపోతుందని కొంతమంది తెలపడంతో హుటాహుటిన కలం దగ్గరకి చేరుకున్నానని అప్పటికే ఆవులు కాలిపోతున్నాయని మంటలు అధికంగా ఉండడంతో ఏమీ చేయలేకపోయానని అన్నాడు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసిందన్నారు. ప్రమాదం జరిగిన స్థలానికి ఎంపిపి రెడ్డి వెంకన్న, స్థానిక సర్పంచ్ గోగాడ సత్యవతి, టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జిఎస్ నాయుడు బాధితులను పరామ ర్శించి ఓదార్చారు. పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి ఉమామహేశ్వరి బాధితులను పరామర్శించి ఓదార్చి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. మూగ జీవాలు సజీవదహనం అవ్వడంతో గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదిభట్ల హరికథా సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

కోటి దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు సంస్మరణ పూర్వక హరికథా మహోత్సవాలు శనివారం సాయంత్రం స్థానిక టిటిడి కల్యాణమండపం ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంగీత దర్శకుడు సాలూరు కోటేశ్వరరావు (కోటి) దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదిభట్ల నారాయణదాసు సంస్కారమే సాలూరి రాజేశ్వరరావు సంగీతమని అన్నారు.రాజేశ్వరరావు తనయుడిగా జన్మించడం పూర్వ జన్మ సుకృతమన్నారు. రాజేశ్వరరావు స్వరపర్చిన స్వర సంపద, రాగాలు నారాయణదాసు జ్ఞానసంపదగా భావిస్తున్నానని చెప్పారు. ఘంటసాల, పి.సుశీల సంగీతం నేర్చుకున్న కళాశాల నేడు కళావిహీనంగా ఉండడం బాధాకరమన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ విజయనగర కీర్తిని ప్రపంచానికి చాటా చెప్పేలా, ఆదిభట్ల జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు కాపుగంటి ప్రకాశ్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, పివి నర్సింహరాజు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్తే అవమానించారు

ప్రజాశక్తి - కురుపాం

తోటి మహిళ కడుపునొప్పితో తీవ్ర అనారోగ్యానికి గురైందని, వైద్య సాయం కోసం ఆమెను గురువారం రాత్రి స్థానిక సిహెచ్‌సికి తీసుకెళ్తే వైద్యాధికారి శ్రీధర్, స్టాఫ్‌నర్సు అనురాధ అవమానించి ఆసుపత్రి నుంచి బయటకు గెంటి వేశారని వబ్బంగి పంచాయతీకి చెందిన ఆరిక ఎర్రమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆసుపత్రిలో వైద్యులున్నప్పటికీ రోగిని పార్వతీపురం తరలించాలని సూచించారని తెలిపారు. అయితే ఆ రాత్రి సమయంలో మహిళలమైన తాము ఎక్కడికి వెళ్లలేమని, ఆ రాత్రికి ఇక్కడే తలదాచుకుంటామని చెప్పినా వినకుండా అవమానించారని బయటకు గెంటేశారని వాపోయింది. దీంతో గత్యంతరం లేక ఆసుపత్రి ఆవరణలోనే ఓ చెట్టు నీడలో తలదాచుకున్నామన్నారు. తమను అవమానించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పూలంగిసేవలో మంత్రి

బొబ్బిలి : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో పూలంగి సేవలో రాష్ట్ర గనులశాఖా మంత్రి సుజయకృష్ణ రంగారావు పాల్గొన్నారు. బొబ్బిలి రాజవంశీయులు అయిన పూర్వీకులంతా వేణుగోపాలస్వామి ధర్మకర్తలుగా ఉన్నారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో నిర్వహించనున్న పూలంగి సేవ ఈ ఏడాది కూడా ఆరున్నర టన్నుల 21 రకాల పూలతో దారి పొడవునా అలంకరించి వేణుగోపాలస్వామి వారిని పల్లకిలో మోసుకుంటూ వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మకర్తలైన సుజయకృష్ణ రంగారావు, బేబినాయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాదీ ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. క్యూ పద్ధతి ద్వారా భక్తులను స్వామివారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. వారితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, గోవిందమాల దారణలో ఉన్న భక్తులు పట్టణంలో ఉన్న ప్రముఖులతో పాటు బొబ్బిలి ప్రాంతంలో ఉన్న ప్రజలు వేడుకలను తిలకించారు.

పలుచోట్ల జన్మభూమి గ్రామసభలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని గంగాపురం, కవిటిభద్ర, ములగలో జరిగిన జన్మభూమి గ్రామసభలలో ఎంపిపి హరిప్రియాధాట్రాజ్, జెడ్‌పిటిసి గొట్టాపు గౌరీశ్వరితో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాల్లోకి వస్తున్న సందర్భంగా ప్రజలు తమ సమస్యలు వారి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ముందుగా గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి జీవాలకు మందులు వేశారు. మెడికల్ క్యాంపులో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గాయత్రిదేవి, ఎంపిడిఒ కె.కృష్ణారావు, తహశీల్దార్ అజరుఫీజాన్ సర్పంచ్‌లు తాన్న రమాదేవి, యాండ్రాపు తిరుపతిరావు, రెడ్డి సింహాచలంతో పాటు అన్ని శాఖలకు చెందిన ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 7, 8, 9 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు చైర్‌పర్సన్ డి.శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.జయప్రకాష్‌నారాయణ, కౌన్సిల్ సభ్యులు కోమటి వెంకటరావు, సంకిలి గోరీశ్వరి, బార్నాల సీతారాం, కోల హేమలత, టిడిపి పట్టణ అధ్యక్షులు కోల వెంకటరావు, గృహ నిర్మాణ, రెవెన్యూ, మెప్మా, ఐసిడిఎస్, పశువైద్యశాఖ, వైద్యశాఖ తదితరులు పాల్గొన్నారు



కవిటిభద్రలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిపి తదితరులు

సిఎం పర్యటనతో ప్రయోజనం శూన్యం : సిపిఎం

బొబ్బిలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన మంత్రి సొంత నియోజకవర్గమైన బొబ్బిలిలో పర్యటించి నప్పటికీ స్థానిక సమస్యలపై మాట్లాడక పోవడం అన్యాయమని సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లిన వారిని, సిపిఎస్ విధానంపై వినతిని ప్చేందు వెళ్లిన ఉపాధ్యాయ సంఘాలను పోలీసులు నిర్బంధించ డంతోనే ప్రభుత్వం చిత్తశుద్ధి తెలుస్తోందన్నారు. జ్యూట్ మిల్లు మూతపడి మూడేళ్లయి జ్యూట్ కార్మికులంతా వీధిన పడినప్పటికీ స్థానిక మంత్రికి గుర్తు రాకపోవడం అన్యాయమన్నారు. ప్రజాధనం దుర్వినియోగా నికే జన్మభూమి కార్యక్రమాలు చేపడుతున్నారని, అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టడం లేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేందుకే జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతీ సారి వరాలు కురిపిస్తున్నారని, వరాలు కురిపించినట్లు ధనాన్ని కూడా కురిపిస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు.

చంద్రన్న కానుకలను వినియోగించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం : సంక్రాంతిని పురస్కరించుకొని ప్రభుత్వం అందిస్తున్న చంద్రన్న కానుకలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెముడుగూడ సర్పంచ్ మండంగి గౌరి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని తాటిశీల డిఆర్ డిపోలో కార్డుదారులకు చంద్రన్న కానుకలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో డీలర్ సన్యాసి, గ్రామపెద్దలు రామారావు పాల్గొన్నారు.

చంద్రన్నబీమా పంపిణీ

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 19వ వార్డు వైకెఎంకాలనీకి చెందిన బండి బ్రహ్మం(52) శనివారం ఉదయం మృతిచెందగా, దహన ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయం కింద భార్య అన్నపూర్ణమ్మకు చంద్రన్నబీమా వర్తింపజేస్తూ రూ.5వేలు నగదును మున్సిపల్ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రన్నబీమా పథకం ద్వారా ఎన్నో కుటుంబాలకు ఆసరా కలుగుతుందన్నారు. బ్రహ్మం కుటుంబానికి త్వరలోనే మిగిలిన బీమా డబ్బులు అందేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిల్ సభ్యులు మంచిపల్లి సత్యనారాయణ, బీమామిత్ర సరస్వతి, ఆర్‌పి జయ, ఎస్‌ఎల్‌ఎఫ్ రమణమ్మ ఉన్నారు.

పాడిరైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయం

సాలూరురూరల్ : పాడి రైతుల సంక్షేమమే విశాఖడెయిరీ ధ్యేయమని పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని శివరాంపురం పాల ఉత్పత్తి దారుల సొసైటీలోని పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు విశాఖ డెయిరీ అనేక ఏళ్లుగా మంచి సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం బాగువలస, బోరబంద, శివరాంపురం పాడి రైతులకు విశాఖడెయిరీ సూపర్‌వైజర్ లగుడు వాసు రూ.5 లక్షల 2 వేల 587లకు 236 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, రవి దుర్గారావు, పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

బలిజిపేట : పార్వతీపురంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వంజరాపు సత్యం నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాలకులు విధానాలపై భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలను మహాసభల్లో చర్చిస్తారన్నారు. నోట్లు రద్దు, జిఎస్‌టి సామాన్యుల జేబులు ఖాళీ అవుతున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వై.మన్మథరావు, బి.భాను పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిజెపి పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంప్రదాయాలపై శనివారం అరకాలగెడ్డ వీధిలో బాలికలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.సుభద్రాదేవి మాట్లాడుతూ సాంస్కృతిక, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతని అన్నారు. హరిదాసు కీర్తినలు, గొబ్బెమలు, అందమైన ముగ్గులతో ప్రతిఒక్కరూ సంక్రాంతిని నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.సత్యవతి, ఎం.మధు, జి.అప్పారావు, ప్రమీలారాణి పాల్గొన్నారు.

హీరోయిన్‌గా కీర్తిన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాకు చెందిన దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్య తీస్తున్న శత్రువుతో స్నేహం సినిమాలో విజయనగరానికి చెందిన కీర్తిన వర్మకు హీరోయిన్‌గా ఎంపిక చేశామని దర్శకుడు తెలిపారు. ఈ సినిమా మొత్తం కాంబోడియాలో నిర్మిస్తున్నామన్నారు. మానవ సంబంధాలను విభిన్న కోణాల్లో చూపించే విధంగా సినిమాను నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కులశేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

'అబద్ధాలు చెబుతున్న ముఖ్యమంత్రి'

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, జిల్లాకు 8 సార్లు వచ్చి ఏం అభివృద్ధి చేశారని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి ప్రశ్నించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్మభూమిలో ఇప్పటికే ప్రజలు నిలదీస్తున్నారన్నారు. అభివృద్ధి జరగకపోయినా గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఉపాధి లేక ఎంతో మంది రోడ్డున పడ్డారన్నారు. అగ్రి గోల్డ్ బాధితుల సమస్య నేటికీ పరిష్కారం కాలేదన్నారు. చెప్పుకుంటూ పోతే ఇలాంటివి కోకొల్లలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కళ్లు తెరిచి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో టి.కోటేశ్వరరావు, టి.రాజారావు, సి.శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఉత్సవాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఫ్రెండ్స్ ఫైనాట్స్ అసోసియేషన్ సభ్యులు మండపాల రవి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శంకర మఠంలో త్యాగరాజు స్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పంచారత్నం కీర్తనలు, గోష్టి గానం ఆలపించారు. కార్యక్రమంలో విద్యార్థులు కె.పద్మప్రియ, ఉష, కామేశ్వరి, ఉమ, జి.సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మోదవలస దళితులకు రక్షణ కల్పించాలి

కెవిపిఎస్, సిఐటియు, వ్యకాస నాయకుల డిమాండ్



సిఐటియు, కెవిపిఎస్ నాయకులకు ఒంటిపై దెబ్బలు చూపుతున్న దళితులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డెంకాడ మండలం మోదవలస గ్రామ దళితులకు పెత్తందార్ల నుంచి రక్షణ కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.పకీరాజు డిమాండ్ చేశారు. శనివారం మోదవలస దళిత కాలనీకి వెళ్లి అక్కడ పరిస్థితిని గమనించి దళితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దెబ్బలు తగిలిన వారిని చూసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై డాడి చేసిన తెలుగుదేశం నాయకులను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడు అడ్డు అదుపులేకుండా దళితులు భూములు లాక్కోవడమే పనిగా ఉన్నారన్నారు. స్థానిక ఎంపిటిసి భర్త కాగితాల సత్యనారాయణ, ఆయన అనుచరులు, ఎమ్మెల్యే కుమారుడు సహకారంతో ఆలోచించి ఈ దాడికి దిగారన్నారు. మహిళలు అని చూడకుండా వివస్త్రలను చేసి కొట్టడం దారుణమన్నారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించి దళితులపై దాడులు చేస్తుంటే చూస్తూ ఉండిపోవడం సరికాదన్నారు. పోలీసులు పెత్తందార్లకు వత్తాసు పలకడం సరికాదన్నారు. తక్షణమే దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పురపాలక సంఘంలో ఉన్న పాఠశాలల్లో నెలకొన్ని ఉన్న సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ విజయనగరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు శనివారం వినతి అందజేశారు. జొన్నగుడ్డిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వినతి అందజేస్తూ పాఠశాలల్లో మౌలిక వసుతులు కల్పించాలని, పాఠశాలలకు ప్రహరీ గోడలను నిర్మించాలని, విద్యార్థుల సంఖ్యను బట్టి మరుగుదొడ్లు నిర్మించాలని, నిర్వహణకు నిధులు ఇవ్వాలని, త్రాగునీటి సౌకర్యం అన్ని పాఠశాలల్లో కల్పించాలని కోరారు. రద్దయిన యుసి స్కూళ్లను తిరిగి పునరుద్దరించాలని, కస్పా హైస్కూల్‌ను రెండు పాఠశాలలుగా మార్చాలని కోరారు. పూల్‌బాగ్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, విటి అగ్రహారం, వైఎస్ఆర్ నగరలో ఉన్నత పాఠశాలలను నెలకొల్పాలని, అన్ని పాఠశాలలకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

30న నాయీ బ్రాహ్మణుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యాన ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రామేశ్వరపు రామారావు తెలిపారు. జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 జిల్లాల నాయి బ్రాహ్మణ మహాసభను విజయవాడలోని బెంజి సర్కిల్ వద్ద నిర్వహిస్తామన్నారు. బార్బర్ షాపుల విద్యుత్ ఛార్జీలను 250 యూనిట్ల వరకూ ఉచితంగా, ఆపైన కమర్షియల్ నుండి డొమెస్టిక్‌గా మార్చాలన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన దేవాలయాల్లో క్షురకులు, వాయిద్య కళాకారులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు. నాయిబ్రాహ్మణ మహిళలకు బ్యూటీ పార్లర్ శిక్షణ కల్పించి పార్లర్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహకారం అందజేయాలన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయి బ్రాహ్మణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.రామారావు, జిల్లా కోశాధికారి టి.బుజ్జిబాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ శంకరరావు, జిల్లా కల్చరల్ సెక్రటరీ ఎం.అప్పారావు, విజయనగరం నియోజకవర్గ కన్వీనర్ రామేశ్వరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూగ యువతి తండ్రిని ఆదుకోండి



ఎస్‌పి పాలరాజుకు వినతి అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

దళిత మూగ అమ్మాయిపై అత్యాచారానికి ప్రయత్నించిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అడ్డుకోబోయిన మూగ అమ్మాయిపై తండ్రిపై కత్తితో దాడిచేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షులు సోము మురళీమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్‌పి బాలరాజుకు వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. మూగ అమ్మాయికి న్యాయం చేయాలని తెలిపారు. ఆయనతో పాటూ సోము రమణ, కె.సురేష్‌కుమార్, జి.గురుమూర్తి ఉన్నారు.

ఇదే విషయంపై లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ చికిత్స పొందుతున్న మూగ అమ్మాయి తండ్రి చుక్క సన్యాసిని కేంద్ర ఆసుపత్రిలో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలన్నారు.

'కేంద్ర సాయాన్ని మరవడం తగదు'

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి మరవడం తగదని బిజెపి జిల్లా కార్యదర్శి ముద్దాడ మధు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలిలో జరిగిన జన్మభూమిలో సిఎం, అభివృద్ధిపై అలా మాట్లాడడం తగదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరిసింహం, ఎం.రమేష్, జి.కార్తీక్, జగ్గారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

లంకాపట్నంలో ఇళ్లు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణంలోని అశోక్‌నగర్‌లో రోడ్డు పక్కనే నివాసమున్న 111 మంది పేదలు హుదూద్ తుపాన్‌కు నష్టపోయారని వారికి లంకాపట్నంలో గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కారాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుదూద్ తుపాన్ సమయంలో, రోడ్డు వెడల్పు పేరుతో రోడ్డున పక కనే ఉన్న అశోక్‌నగర్ కాలనీ వాసులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే హామీనిచ్చారన్నారు. లంకాపట్నంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారన్నారు. నేటికి ఎవరికి ఎటువంటి ప్రత్యామ్నాయం చూపలేదన్నారు. అదె ద్దకట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే లంకాపట్నంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ గోవిందరావుకు వినతి అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, దాసు, లక్ష్మణరావు, పేదలు పాల్గొన్నారు.

పైడితల్లెమ్మను దర్శించుకున్న సంగీత దర్శకుడు కోటి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పట్టణంలోని పైడితల్లెమ్మ ఆలయాన్ని ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు కోటేశ్వరరావు(కోటి) దంపతులు శనివారం దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన ఆయనకు పూజారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితుల ఆశీర్వచనాలు తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కోటి సతీమణి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్థానిక రామనారాయణంలో శనివారం విలువిద్య శిక్షణ శిబిరాన్ని కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపల్ కర్నల్ రుద్రక్స్‌అత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేందుకు ఆర్చరీ ద్వారా ఎక్కువ అవకాశముందన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకూ సాయంత్రం 5 గంటల నుండి 8 వరకూ ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, ఆర్చరీ శిక్షకులు బి.త్రినాద్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

స్ఫూర్తిదాయకం... కమ్యూనిస్టు ఉద్యమం

అది విజయనగరం - శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా. భూస్వాములు, పెత్తందారులు ప్రజలను పట్టిపీడిస్తున్న రోజులవి. ఓ వైపు గిరిజనం, మరోవైపు రైతాంగం నిత్యం దగాకు గురౌతోంది. సరిగ్గా అప్పుడే కమ్యునిస్టు పార్టీ జిల్లాలో మొగ్గతొడిగింది. 1953 ఏప్రిల్ 28,29,30, మే 1వ తేదీల్లో పాతపట్నం తాలూక జమిలి ప్రాంతం పార్టీ తొలి జిల్లా మహాసభలకు వేదికయ్యింది. త్రిపురనేని వెంకటేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అంతకుముందు అదే ఏడాది అగస్టు 7న ఏర్పడిన అడ్‌హాక్ కమిటీ కార్యదర్శిగానూ కార్యదర్శిగానూ ఆయన కొనగేవారు. ఇలా ఆవిర్భవించిన కమ్యూనిస్టు ఉద్యమం పడిలేచిన కెరటంలా ముందుకు సాగుతోంది. ఉద్యమ సారధులు తమ జీవితాలను త్యాగం చేశారు. అలాంటి వారిలో ఆదిభట్ల కైలాసం ఒకరు.



2005...తోటపల్లి నిర్వాసితుల పోరాటం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పటి పార్వతీపురం డివిజన్ కేంద్రం అప్పట్లో తాలూకా కేంద్రం. తాలూకా కార్యదర్శిగా ఉన్న ఆదిభట్ల కైలాసం కృషితో పెదమేరంగి ఉద్యమ కేంద్రంగా మారింది. బొబ్బిలి ప్రాంతానికి నాయకత్వం వహించిన గంటి రాజేశ్వరరావు 1952 నవంబర్‌లో తీవ్ర అనారోగ్యంతో అమరులయ్యారు. ఆ తరువాత వసంతాడ రామలింగాచారి పూర్తికాలపు కార్యకర్తగా బాధ్యతలు స్వీకరించారు. 1952, 1955 ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీకి తలపడ్డారు. తద్వారా ఏర్పడిన పరిచయాలు పార్టీ విస్తరణకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. 1957లో త్రిపురనేని జిల్లా కార్యదర్శి బాధ్యతలను విరమించిన తరువాత శ్రీకాకుళానికి చెందిన డి.గోవిందరాజులు ఎన్నికయ్యారు. ఆ తరువాత 1959లో గిరిజన ప్రాంత మంతటా సోంపేట తాలూకలోనూ, పెదమేరంగి, నారాయణపురం, బొబ్బిలి ప్రాంతాల్లోనూ కమ్యునిస్టు ఉద్యమం బలపడింది. ఇదే కాలంలో అటు ఏజెన్సీలో ఆదివాసీ ఉద్యమం కూడా ఊపందుకుంది. 1962లో పార్టీ కార్యదర్శిగా రామలింగాచారి ఎన్నికయ్యారు. 1963 సెప్టెంబర్ 17,18తేదీల్లో బొబ్బిలిలో జరిగిన శ్రీకాకుళం సమితి సమావేశానికి రాష్ట్ర కమిటీ తరపున నండూరి ప్రసాదరావు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం తాలూకా కమిటీకి బదులుగా భద్రగిరి, సీతంపేట ప్రాంతాలకు ఆర్గనైజింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. కన్వీనర్లుగా ఆదిభట్ల కైలాసం, వి.సత్యం, బి.అప్పలనాయుడు, ఎ.సోములు నియమితులయ్యారు. పార్వతీపురం ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్లుగా ఎం. చిన్నంనాయుడుతోపాటు నలుగురు సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కాలంలో ముందుకొచ్చిన గిరిజనులు దోపిడి, సాగునీటి ఇబ్బందులు, భూ సమస్య, అదనపు శిస్తు వంటి సమస్యలపై పార్టీ మిలిటెంట్ పోరాటాలు చేయడంతో ప్రజాబలం మరింత పెరిగింది. 1964లో జరిగిన పరిణామాల వల్ల దేశవ్యాప్తంగా కమ్యునిస్టుల్లో చీలికవచ్చినా జిల్లాపై ఆ ప్రభావం పడలేదు. ఆ తరువాత పరిస్థితులను అర్థం చేసుకున్న మెజార్టీ నాయకత్వం, సభ్యులు సిపిఎంలో చేరారు. 1964లో సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన సిపిఎం పదో జిల్లా మహాసభకు టి.నాగిరెడ్డి, ఎస్.ప్రసాదరావు హాజరయ్యారు. అదే ఏడాది డిసెంబర్ 2న గుమ్మలక్ష్మీపురంలో బహిరంగసభ జరుగుతుండగా జిల్లా కార్యదర్శి వి.రామలింగాచారి, పి.వాసుదేవ రావులపై స్థానిక భూస్వామి మేడిద సత్యం భౌతిక దాడులు చేయించాడు. మరోవైపు దేశవ్యాప్తంగానూ సిపిఎంపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలకు గురిచేస్తున్న రోజులవి. ఈనేపథ్యంలో గిరిజన ప్రాంతంలో పర్యటిస్తున్న చౌదరి తేజేశ్వరరావు, నాగిరెడ్డి, రామలింగాచారి, గోవిందరాజులు, మొండెంఖల్ సర్పంచి ఎండుదొరతోపాటు మరో 12మందిని ఆదిభట్ల ఇంట్లో అరెస్టుచేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. మరో 600 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంటునే పార్టీ జిల్లాలో విస్తరించింది. కూలిరేట్లు, సాగుభూమి సాధన కోసం 1964లో ప్రారంభమైన పోరాటాలు ఉధృతంగా సాగాయి. దీన్ని ప్రతిఘటించిన కోరన్న, మంగన్నలను కాల్చి చంపేశాడు. వారి భౌతికకాయాలను సవారీపై తిప్పుతూ వారం రోజులపాటు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఇలా మొక్కవోని దీక్షతో సాగిన ఉద్యమం ఆ తరువాత వ్యక్తిగత హింసావాదం వైపు మళ్లడంతో 1967లో మరో చీలిక అనివార్యమైంది. అప్పట్లో పాలకుల నిర్బంధాలకు గురైన సుమారు 200మంది కార్యకర్తలు అమరులయ్యారు. వందలాది మందిని జైల్లోపెట్టారు. వీరిలో ఇప్పటి సిపిఎం రాష్ట్ర నాయకులు చౌదరి తేజేశ్వరరావు, ఆయన భార్య సంపూర్ణమ్మ కూడా ఉన్నారు. వీరి నిర్బంధంతో పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. తిరిగి కోలుకోవడానికి మరో 20ఏళ్లు పట్టింది. 1987లో తేజేశ్వరరావు సహకారంతో నేటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి గిరిజన ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి ఉద్యమ పున:నిర్మాణానికి ఎనలేని కృషిచేశారు. అదే కాలంలో ఇటు బొబ్బిలి కేంద్రంగా జరుగుతున్న విద్యార్థి, యువజనోద్యమం బలపడింది. ఈ సంఘటన రైతులతోపాటు కార్మికవర్గానికి స్ఫూర్తి నిచ్చింది. 1990 మే 1న బొబ్బిలి జ్యూట్‌మిల్లుపై ఎర్రజెండా రెపరెపలాడింది. జిల్లాలో సిఐటియు ఉద్యమానికి నాందిపలికింది. అక్కడి నుంచి జిల్లాలో జ్యూట్‌మిల్లులు, ఫెర్రోఎల్లాయిస్, సంఘటిత, అసంఘటిత రంగాల్లో బలమైన శక్తిగా మారింది. తద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ విస్తరించింది. బొబ్బిలిలో నిర్వహించిన 6వ జిల్లా మహాసభ పార్టీ నిర్మాణానికి ఎంతో దోహదపడింది. తోటపల్లి, జంఝావతి, తారకరామతీర్థసాగర్, పెద్దగెడ్డ నిర్వాసితుల పక్షాన నికరంగా పోరాడింది. దీంతో, ప్రభుత్వం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పించే వరకూ ఉద్యమాన్ని కొనసాగించింది. సిపిఎం సారథ్యంలో సాగిన తోటపల్లి ఉద్యమం అప్పట్లో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి సహా పలువురు సిపిఎం నాయకులు సుమారు 40రోజులపాటు జైలు జీవితం అనుభవించారు. ఇటు ఇళ్లు, ఇళ్ల స్థలాల ఉద్యమంతో విజయనగరం జిల్లా కేంద్రంలోనూ పార్టీ శక్తి పెరిగింది. ఓవైపు ప్రభుత్వ నిర్బంధాలు, దాడులు ఎదుర్కొంటునే జిలా పార్టీని ముందుకు నడిపించేందుకు కృష్ణమూర్తి విశేష కృషి చేశారు. 7వ జిల్లా మహాసభలో తమ్మినేని సూర్యనారాయణ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

అప్పటి వరకూ కార్యదర్శిగా పనిచేసిన కృష్ణమూర్తి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత తమ్మినేని నాయకత్వంలో జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయి. ముఖ్యంగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల తరపున పెద్దఎత్తున పోరాటం చేయడంతో రైతులకు మెరుగైన ప్యాకేజీ సాధ్యమైంది. ఇప్పటికీ వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఇటు దత్తిరాజేరు మండలంలో తలపెట్టిన ఎన్‌ఎడికి వ్యతిరేకంగా రైతుల తరపున నిలబడింది. దీంతో, ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కు తగ్గింది. పలుచోట్ల భూపోరాటాలు చేపట్టింది. ప్రస్తుతం కొవ్వాడ దళితులకు అండగా నిలిచి పోరాడుతోంది. అదే పంథాలో జిల్లా సమగ్రాభివృద్ధికై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతోంది. ఇటు వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి కోసం పరితపిస్తోంది. ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం 8వ మహాసభలకు సన్నద్ధమౌతోంది.



ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం
ఆదివారం
7 జనవరి 2018



బ్యాంకు వద్ద బారులు తీరిన జనం



షట్టర్ వేసిన ఎస్‌బిఐ ఎటిఎం




మూతబడిన యాక్సిస్ బ్యాంకు ఎటిఎం

ఏటీ(ఎం) కష్టాలు

అసలే పండగ సమయం. ప్రతిఒక్కరికీ నగదు అవసరం. ఉదయం నుంచే ఎటిఎంకు క్యూ కట్టారు జనం. ఏం లాభం! ఎటిఎం నుంచి డబ్బులు రాలేదు. ఉసూరుమంటూ మరో ఎటిఎంకు వెళ్లినా అక్కడా అదే పరిస్థితి. ఏ ఒక్కటీ పనిచేయలేదు. జిల్లాలోని ఎటిఎంలలో నగదు నిల్వలు నిండుకున్నాయి. విజయనగరం, బొబ్బిలి పట్టణాల్లో శనివారం ఏ బ్యాంకు ఎటిఎంలోనూ నగదు నిల్వలు లేవు. కొద్దిపాటి నగదు ఉన్న ఎటిఎంల వద్ద జనాలు క్యూలు కట్టారు. పండగ ముందు కావడంతో అవసరాల నిమిత్తం ఎటిఎంకు వెళ్లినా డబ్బులు లేకపోవడం, బ్యాంకులో రూ.ఐదు వేలకు మించి విత్‌డ్రా ఇవ్వకపోవడంతో ప్రజలు పండగ ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- ప్రజాశక్తి-కంటోన్మెంట్/ బొబ్బిలిటౌన్




తెరుచుకోని ఎటిఎం



మూతబడిన ఎస్‌బిఐ ఎటిఎం





ఖాళీగా ఉన్న ఎటిఎం



మూతబడిన ఇండియన్ బ్యాంకు ఎటిఎం



ఖాళీగా ఉన్న ఎటిఎం



బొబ్బిలిలో ఎటిఎం వద్ద జనాలు

DigiLocker

అరచేతిలోనే అన్ని పత్రాలు

ధ్రువపత్రాలు నిశ్చింతగా భద్రపరుచుకోండి • డిజిలాకర్ యాప్‌తో ఎన్నో ఉపయోగాలు

ప్రజాశక్తి-విజయనగరం

మన వ్యక్తిగత ధ్రువపత్రాలు, డాక్యుమెంట్లను జాగ్రత్తగా భద్రతపరుచుకుని అవసరానికి వినియోగించుకుంటాం. అయితే వాటిని ప్రతిసారీ వెంట తీసుకు వెళ్లాలంటే కష్టమైన పని. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం డిజిలాకర్ పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది జి-మెయిల్ మాదిరిగా కూడా ఉపయోగపడుతుంది. ఈ యాప్‌లో ఆధార్, ఓటరుకార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలను దాచుకోవచ్చు. ఇలా మనం దాచుకున్న పత్రాలు ఒరిజినల్లా? కాదా అని ప్రభుత్వం సరిచూసుకుంటుంది. అనంతరం ఇ సైన్ అవుతుంది. ఇ సైన్ అయిన తర్వాత మనం సంబంధిత ధ్రువపత్రాలను ఉపయోగించుకోవచ్చు. డిజిలాకర్‌లో దాచుకున్న పత్రాలను అవసరమైనప్పుడు జిరాక్స్ తీసుకోవచ్చు. అవసరమైన వారికి ఈ యాప్ నుంచే మెయిల్ ద్వారా పంపుకోవచ్చు. తనిఖీల సందర్భంగా ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు చూపమంటే సెల్‌ఫోన్‌లో డిజిలాకర్ ఓపెన్ చేసి చూపవచ్చు. ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్‌లో భద్రపరిచిన పత్రాలు దొంగిలించడం, లేదా హ్యాక్ చేయడం కష్టతరమైన పని.

గూగుల్ ప్లే స్టోర్‌లో డిజిలాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్ చేసి సైనప్‌పైన క్లిక్ చేయాలి. తర్వాత పేరు, ఆధార్, సెల్ నంబరు ఎంటర్ చేయాలి. అనంతరం వెరిఫికేషన్ కోడ్‌తో ఒటిపి (వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. ఒటిపి నమోదు చేయడం ద్వారా మన రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్టర్ అయినప్పటి నుంచి మనం మన ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేసుకోవచ్చు.









ఇల్లే అందం.. ఇంద్ర ధనస్సు చందం!

రంగుల్లో ఏముందిలే! అని కొట్టిపారెయొద్దు. కట్టిన భవనానికి వీటితోనే అందం ఉట్టిపడుతుంది. అలాగని ఇష్టం వచ్చిన రంగులను ఎక్కడ పడితే అక్కడ వేసుకుంటే చూడ్డానికి అస్సలు బాగుండదు. రంగులకున్న లక్షణాలను బట్టి, శాస్త్రీయతను తెలుసుకొని వాటిని వేసుకుంటే మనలోని హుందాతనాన్ని తెలియజేస్తాయి. ఇప్పడు విజయనగరం పట్టణంలో అదే పరిస్థితి. ప్రతిఒక్కరూ తమ అభిరుచికి తగ్గట్టుగా ఇళ్లకు రంగులద్దుతున్నారు. సంక్రాంతి సందర్భంగా, కొత్తగా వెలుస్తున్న భవనాలు వివిధ రంగుల్లో మెరిసిపోతున్నాయి.

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

ఆకర్షణీయ రంగులతో గృహాలు







ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి • హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు అన్యాక్రాంతమయ్యాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డేగల అప్పలరాజు తెలిపారు. వెంటనే ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం శృంగవరపుకోట పట్టణంలో ఆక్రమణలకు గురైన చెరువులు, బందలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005-06లో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా, అధికారులు సమాచారం ఇచ్చారని, దాంతో పోలిస్తే నేడు పదుల సంఖ్యలో చెరువులు, పోరంబోకు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. అన్యాక్రాంతమైన భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. పట్టణానికి ఆనుకుని ఉన్న బాబుచెరువు, ఈరేసుబంద, బుద్ధాయిబంద ఇప్పటికే కనుమరుగై వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయన్నారు. గతేడాది అవురుబందను ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారని వివరించారు. నాడు ప్రభుత్వ చెరువని చెప్పిన రెవెన్యూ అధికారులు.. నేడు కాసులకు కక్కుర్తిపడి నోరు మెదపడం లేదని విమర్శించారు. అవురు బందను ఆనుకుని ఉన్న 40 సెంట్ల పోరంబోకు స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని, అక్కడ 40 ఏళ్ల నుంచి నివసిస్తున్న గిరిజనులను బెదిరించి ఖాళీ చేయించాలని చూస్తున్నారని తెలిపారు. గిరిజనులకు అండగా సిపిఎం నిలుస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ చెరువులు, బందలు ఆక్రమణలకు గురైతే రానున్న రోజుల్లో తిండిగింజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారని, వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఈ నెలాఖరికి మరుగుదొడ్లు లేకుంటే రేషన్, పింఛను వంటివి ఆపేస్తామని, స్థలం లేకుంటే ప్రభుత్వ స్థలం చూపిస్తామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. నడబంద కళ్లాల వద్ద నివసిస్తున్న 12 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించక పోవడం అన్యాయమన్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను చూపిస్తున్న సిపిఎం నాయకులు

పాఠశాలల్లో విజయవంతంగా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కొత్తవలస

'జన్మభూమి'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని నియోజకవర్గ నోడల్ అధికారి వి.ఎస్.భాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని మంగళపాలెం, దెందేరు గ్రామసభల్లో డిఇఒ నాగమణితో కలిసి ఆయన పాల్గొన్నారు. దెందేరు సభలో ఆయన మాట్లాడుతూ శృంగవరపుకోట మండలం వెంకటరమణపేటలో 300 మంది విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సర్వశిక్షాభియాన్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత బాలికల పాఠశాలలకు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జి.శ్రీదేవి, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రావి స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన

నేడు కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న శ్రీధర్

ప్రజాశక్తి-గజపతినగరం

రావి స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ రావి శ్రీధర్ తెలిపారు. మండలం లోని పురిటిపెంటలో తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోటీలను ఉదయం 10 నుంచి రాత్రి పది గంటల వరకు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన కబడ్డీ ఆటగాళ్లతో 11 జట్లు పాల్గొంటాయని వివరించారు. ట్రస్టు ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో నిర్వాహకులు తాతబాబు, గంట్రేటి అప్పలనాయుడు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న నాగేశ్వరరావు

పార్కు అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టు సమీపంలోని ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు న్యాయమూర్తి పల్లి నాగేశ్వరరావు తన కుమారుడు రఘునందన్ పేరిట రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేస్తే కాలనీవాసులతోపాటు మిగతా వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పార్కు అభివృద్ధి కోసం దాతలు ముందుకొచ్చి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టి.ముత్యాలనాయుడు, కెఎస్ఎం శర్మ, సిహెచ్ తిరుపతిరావు, శీర వాసుదేవరావు, బి.జగ్గునాయుడు, మోహనరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అధికారులను నిలదీత



తాగునీటి సమస్యపై అధికారులను నిలదీస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెంలో ఫ్లోరైడ్ సమస్య వల్ల తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మంగళపాలెంలో జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీటి సమస్యపై సభలో ఆందోళన చేశారు. వైస్ ఎంపిపి పి.రాజన్న స్వగ్రామంలో తాగునీటికి అవస్థలు పడుతున్నా స్పందించక పోవడమేమిటని నిలదీశారు. ఎంపిడిఒ నారాయణరావు స్పందిస్తూ ఎక్కడ బోరు తీసినా తాగునీరు రావడం లేదని, పొలాల్లోని బావి నుంచి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి, డిఇఒ జి.నాగమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోళ్ల రమణమ్మ, వైస్ ఎంపిపి పి.రాజన్న, టిడిపి మండల అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ, సర్పంచ్ వి.శివాజీ, కె.భూలక్ష్మి పాల్గొన్నారు.

హద్దు మీరిన తెలుగు తమ్ముళ్లు

గజపతినగరం : మండలంలోని పాతశ్రీ-రంగరాజపురం గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు హద్దులు మీరారు. సర్పంచ్ శ్రీనివాసరావుకు సభలో కనీసం కుర్చీ కూడా వేయకుండా అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారం వ్యవహరించారు. దీంతో మనస్తాపానికి గురైన సర్పంచ్ సభ నుంచి వెనుదిరిగేందుకు ప్రయత్నించగా, తహశీల్దార్ శేషగిరిరావు, ఇతర అధికారులు సర్దిచెప్పారు. వైసిపికి చెందిన సర్పంచ్ కాబట్టే టిడిపికి చెందిన బెల్లాన అచ్చింనాయుడు అంతా తానై తనను అవమానించారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇళ్లు, పింఛన్లు ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన వారే మంజూరు చేసుకుంటున్నారని సర్పంచ్ గ్రూపు అధికారులను నిలదీసింది.

అంగన్వాడీలకు వంట సామగ్రి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శనివారం అంగన్వాడీ కేంద్రాలకు రూ.20 వేలు విలువైన వంటసామగ్రిని ప్రత్యేకాధికారి వెంకటరావు పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి జెడ్‌పిటిసి జి.అప్పలమ్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణవేణమ్మ, సర్పంచ్ సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గంట త్రినాథరావు, ఎంపిటిసి ఎస్.పైడిరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్యామల, డిటి వెంకటరమణ, ఎఒ గోవిందమ్మ, పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రసాద్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వంగర ఎంపిటిసి రాణి భర్త, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ నాగూరు ప్రసాద్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకుడు కొల్లి అప్పలస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపిపి బెజవాడ రాజేశ్వరి ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని కె.కృష్ణాపురంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినా నేటికీ బిల్లులు అందలేదని సర్పంచ్ ఎం.తిరుపతి ఎమ్మెల్యే వద్ద వాపోయారు. బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. సిసి రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. అనంతరం చంద్రన్న కానుకలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బెజవాడ రాజేశ్వరి, తహశీల్దార్ కల్పవల్లి, టిడిపి మండల కన్వీనర్ బి.సత్తిబాబు, నాయకులు చంద్రశేఖర్, కె.శివ పాల్గొన్నారు.

అందని బిల్లులు

పెదమానాపురంలో నిర్వహించిన గ్రామసభలో ధాన్యం కొనుగోలు డబ్బులు చెల్లించడం లేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బ్యాంకుల్లో ధాన్యం డబ్బులు జమ అయినా, బ్యాంకర్లు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మించినా బిల్లు అందలేదని కాంట్రాక్టరు శివాజీరావు పట్నాయక్ వాపోయారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.అప్పలమ్మ, ఎంపిడిఒ కృష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్‌పిటిసి కె.రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చంద్రంపేట, పెదవేమలి, పెంటశ్రీరాంపురం, పొల్లంకి గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. పెదవేమలిలో జన్మభూమి కార్యక్రమం ప్రారంభించినప్పుడు దరఖాస్తు చేసుకున్నా నేటికీ పింఛను అందించలేదని చప్ప నారంనాయుడు అధికారులను నిలదీశారు. ఇదే సమస్యపై పెంటశ్రీరాంపురంలో గ్రామస్తులు నిలదీయడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ నీలకంఠరావు, వైస్ ఎంపిపి రంధి రామునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కె.భాస్కరనాయుడు, సిఎస్ డిటి తుంగరాజు, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం

గజపతినగరం : అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపిపి గంట్యాడ శ్రీదేవి అన్నారు. మండలంలోని బంగారమ్మపేట, రాజుపేట గ్రామాల్లో శనివారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ వాతావరణంలో జన్మభూమి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అర్హులైన వారికి ఉగాదికి పింఛన్లు ఇచ్చే కార్యక్రమం ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.ఈశ్వరరావు, సర్పంచ్ సత్తిబాబు, టిడిపి జిల్లా నాయకులు రావి శ్రీధర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చింతలవలస ఎంవిజిఆర్‌లో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఐటి ఆధారిత సంస్థల వ్యవస్థాపనపై కార్యక్రమాన్ని సాంకేతిక కళాశాలలో నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యం పెంపొందించేందుకు మహిళా వ్యవస్థాపకులకు ఉన్న అవకాశాలు, సవాళ్లను తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. విద్యార్థులకు పై అంశాలపై గురజాడ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సిఇఒ, ఎంవిజిఆర్ పూర్వ విద్యార్థి వి.ఉషారాణి అవగాహన కల్పించారు. సంస్థలో వెబ్ డెవలప్‌మెంట్, కెఫ్‌ఫాల్, వ్యవసాయ సంబంధిత తదితర టెక్నికల్ అంశాలపై ఎక్కువ ఆసక్తి, అవగాహన కలిగి అంది పుచ్చుకుని విజయం సాధించేందుకు ఉండాల్సిన నైపుణ్యాలను వివరించారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు చెందిన కేర్‌వేర్ టెక్నాలజీ సిఇఒ విజయశ్రీ సూర్యదేవ, సంస్థను స్థాపించేందుకు చేసిన కృషి, అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు కెవిఎల్ రాజు, సహ ప్రధానాచార్యులు, సుబ్బరాణి, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-చీపురుపల్లి

పట్టణంలోని సత్యరామా డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం శ్రీకాకుళంకు చెందిన సింధూర కంటి ఆసుపత్రి, సత్యరామ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ఎస్.జయరాం అశోక్‌కుమార్, సత్యరామా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జిఎ జగదీష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనేకమంది పాల్గొన్నారు.

సైన్స్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పెదతాడివాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యా విషయక సైన్స్ మేళాను శనివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు ప్రారంభించారు. ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గుణుపూరుపేట, పెదతాడివాడలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అనంతరం జన్మభూమి కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, జెడ్‌పిటిసి సభ్యులు పతివాడ అప్పలనారాయణ, తహశీల్దార్ వి.రామకృష్ణ, ఎంపిడిఒ జిఎస్ నిర్మలాదేవి, సర్పంచి కరుమజ్జి వెంకటరత్నం, ఎంపిటిసి సభ్యులు గాదిపల్లి సంతోష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



చీపురుపల్లిలో సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే మృణాళిని

ప్రజాశక్తి-చీపురుపల్లి

నియోజకవర్గంలో శత శాతం అభివృద్ధి సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తెలిపారు. జన్మభూమి-మనఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన జన్మభూమిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అధికారుల సహకారం, ప్రజాప్రతినిధుల చొరవతో 70 శాతం అభివృద్ధి పనులు సాధించామన్నారు. మిగిలిన 30 శాతం పనులను వచ్చే ఏడాది కాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినట్లయితే శతశాతం సాధించడం గొప్ప విషయమేమీ కాదన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసిననాడే ప్రజాప్రతినిధులుగా సాధించిన ప్రగతి అవుతుందన్నారు. ప్రతీ పేద వాడికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా 2,195 మందికి రూ.23 లక్షల 67 వేల 5 వందలను ప్రతీనెల పింఛన్ రూపంలో అందజేస్తున్నామన్నారు. 1958 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 1641 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. 280 మరుగుదొడ్లు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, మరో 37 మరుగుదొడ్లు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల 68 లక్షలను వెచ్చించామన్నారు. ఈ ఏడాదికి 1290 ఎల్ఇడి లైట్లను రూ.9.36 లక్షలతో చీపురుపల్లిలో వేయనున్నామన్నారు. మండలానికి ఐదు వందల కొత్త పింఛన్ మంజూరయ్యా యన్నారు. అంతకు ముందు గర్భిణులకు జరిగిన సీమంతాలలో పాల్గొని వారికి గాజులు, పసుపు కుంకుమలను అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులను, సంక్రాంతి కానులను అందజేశారు. సర్పంచి మీసాల సరోజిని ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎంపిపి రౌతు కాంతమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మీసాల వరహాలనాయుడు, కె.త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, ఆర్ఇసిఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు పాల్గొన్నారు.

'జన్మభూమి'లో సమస్యలు పరిష్కారం : కమిషనర్ జయరాం

నెల్లిమర్ల : జన్మభూమి కార్యక్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ టి.జయరాం తెలిపారు. శనివారం నగర పంచాయతీలోని బయిరెడ్డి వీధిలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషర్ మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా సిఒ జి.రాము, టిడిపి నాయకులు బి.నాగేశ్వరరావు, ఎల్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తల్లికి కన్నీటి వీడ్కోలు



పార్వతమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి-డెంకాడ

శుక్రవారం తెల్లవారి మృతి చెందిన నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తల్లి పార్వతమ్మ పార్థివ దేహానికి శనివారం ఉదయం స్వగ్రామం మోపాడలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని వందలాది మంది వైసిపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, బంధువులు, శ్రేయోభిలాషులు సందర్శించి నివాళులర్పించారు. తల్లి మృతి విషయం తెలుసుకున్న బడ్డుకొండ అప్పలనాయుడు సింగపూర్ నుంచి శుక్రవారం రాత్రి 11.30 గంటలకు స్వగ్రామం చేరుకున్నారు. తల్లి మృతదేహాన్ని చూసి కన్నీరు పెట్టారు. ఆయన్ను చూసిన గ్రామస్తులు చలించిపోయారు. శనివారం ఉదయం మాజీ ఎంపి బొత్సఝాన్సీలక్ష్మి, వైసిపి కేంద్ర పాలకమండలి సభ్యులు పి.సాంబశివరాజు, జిల్లాసమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం మాజీఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, బొత్స లక్ష్మణరావు, మాజీమంత్రి బొత్ససత్యనారాయణ తల్లి, స్థానిక నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైసిపి, టిడిపి నాయకులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, పతివాడ అప్పలనాయుడు, చనుమల్ల వెంకటరమణ, బంటుపల్లి వాసుదేవరావు, సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, ఎఎంసి చైర్మన్ కర్రోతు సత్యనారాయణ తదితరులు పార్వతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉదయానికే అనేకమంది అక్కడకు చేరుకున్నారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు.

'ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాలి'

చీపురుపల్లి : ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విధంగా యువత తయారవ్వాలని యువజన సర్వీసుల శాఖ సహాయ మేనేజర్ వివి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్, యువజనల సర్వీసుశాఖ, అగ్నిమాపకదళం సంయుక్తంగా నిర్వహించిన శిక్షణా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువత గురించి మంచి కార్యక్రమాలు ప్రవేశ పెడుతోందన్నారు. యువజన మహోత్సవాలలో జరుగుతున్న రీతిని ఆయన ప్రశంసించారు. అనంతరం శిక్షణలో పొందిన యువతకు సర్టిఫికెట్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.తాతారావు, ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి రమణ, రెడ్ క్రాస్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ డి.గౌరీశంకర్, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఆనంద్‌కుమార్

ఇళ్ల పునర్నిర్మాణానికి అనుమతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

థామస్‌పేట అగ్ని ప్రమాద బాధితులు ఇళ్లను పుననిర్మించుకోవచ్చని హైకోర్టు అనుమతించినట్లు ఎయిమ్స్ విద్యా సంస్థల అధినేత, టిడిపి నాయకులు కడగల ఆనంద్‌కుమార్ తెలిపారు. థామస్‌పేట అగ్ని ప్రమాద బాధితులను శనివారం ఆయన పరామర్శించి బాధితులకు హైకోర్టు ఉత్తర్వులను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో 43 పూరిళ్లు దగ్ధమైన బాధితులు తిరిగి వాటిని పునర్ నిర్మించుకోవచ్చన్నారు. కోర్టు అనుమతి పత్రాలను రెవెన్యూ, పోలీసు అధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యరకమంలో టిడిపి నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఆర్.వేణు పాల్గొన్నారు.

నేడు '5కె రన్'

చీపురుపల్లి : జన్మభూమి-మనఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. స్థానిక విలేకర్లతో శనివారం ఆయన మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ 5కె రన్ కార్యక్రమం అలజంగి వరకు సాగుతుందన్నారు. ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ 5కె రన్‌ను ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ప్రారంభిస్తారన్నారు. రన్‌లో యువత, విద్యార్థులు, క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

పశుపోషణతో అభివృద్ధి

నెల్లిమర్ల : పశుపోషణతో రైతులు రెండెంకల అభివృద్ధిని సాధించవచ్చని పశుసంవర్ధక శాఖ ఎడిఎ టి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నగర పంచాయతీ పరిధిలో పలు వార్డుల్లో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దూడల్లో నట్టల నివారణలో భాగంగా 201 పశువులకు మందులను పంపిణీ చేసి 1300 పశువులకు అన్నివిధాలా పరీక్షలు చేపట్టారు.

ధనలక్ష్మికి సావిత్రిభాయి పూలే అవార్డు

ప్రజాశక్తి-చీపురుపల్లి

పట్టణంలోని కెజిబివి ప్రిన్సిపల్ ఇజ్జరోతు ధనలక్ష్మికి సావిత్రిభాయి పూలే అవార్డు వచ్చిన సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. కెజిబివి పాఠశాలలో జరిగిన అభినందన సభలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ జమ్ము మహలక్ష్మునాయుడు మాట్లాడుతూ ధనలక్ష్మి పనితీరు మెరుగుదలతో పాటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ధనలక్ష్మిలాగే ఇతర ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల స్కూలు కాంప్లెక్సు చైర్మన్ వడ్డాది అప్పారావు, పిఆర్‌టియు మండల అధ్యక్షులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మీసాల అప్పలనాయుడు, సిఆర్‌పిలు కె.రామకృష్ణ, వినోద్, కెజిబివి సిబ్బంది సుకన్య, గాయత్రి, నిర్మల, అరుణ, సత్యవతి, జ్ఞానకుమారి, రమణమ్మ పాల్గొన్నారు.



ధనలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఇఒ మహలక్ష్మునాయుడు

కొటికిపెంటలో 'జన్మభూమి' బహిష్కరణ

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కొటికిపెంటలో శనివారం చేపట్టిన జన్మభూమి కార్యక్రమాన్ని గ్రామస్తులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఇజ్జాడ అప్పలనాయుడు, సలాది అప్పలనాయుడు, గ్రామస్తులు కలిసి జన్మభూమి గ్రామసభ నిర్వహించొద్దని అధికారులను అడ్డుకున్నారు. కొటికిపెంటలో ఇప్పటికీ ఒక్క రేషన్‌కార్డు, పింఛన్, ఇల్లు గానీ మంజూరు చేయలేదని, నాలుగు జన్మభూములైనా సమస్యలు పట్టించుకోవడం లేదని అందుకే ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. సమస్యలను పరిష్కరించని జన్మభూమి కార్యక్రమాలు ఎందుకని అధికారులను నిలదీశారు. గురువునాయుడుపేటలో జరిగిన జన్మభూమిలో పారిశుధ్యం పనులు చేపట్టడం లేదని, దీంతో ప్రజలు అనారోగ్యంబారిన పడతారని, అధికారులను వైసిపి మండల శాఖ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పిఎస్ శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ పి.ఈశ్వరరావు, ఎపిడి కె.సావిత్రి, స్పెషలాఫీసర్ సత్యనారాయణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలోని మిర్తివలస, తారాపురం, పాతరేగ, కొత్తరేగ గ్రామాల్లో జన్మభూమి సభలు జరిగాయి. తారాపురంలో సర్పంచ్ నల్ల పెదసూరయ్య ఆధ్వర్యాన జన్మభూమి నిర్వహించారు. సభ మొదలు కాకముందే వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు ఇవ్వలేదని, తెలుగుదేశం కార్యకర్తలకే బిల్లులవుతున్నాయని, గ్రామంలో 22 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి చేశామని, దాంట్లో 15 మందికి జియోట్యాగింగ్ చేయలేదని లబ్ధిదారులు అధికారులపై ధ్వజమెత్తారు. మరుగుదొడ్ల బిల్లులను అడ్డాల వెంకటరావు పార్టీ పరంగా చేస్తున్నారని, ఇళ్లులేని పేదలు అనేక మంది ఉన్నారని, వీరందరికీ ఇళ్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, మెయిన్ రోడ్డులో కూడా విద్యుత్ బల్బులు వేయడం లేదని అన్నారు. సర్పంచ్‌గా షాడోనేత వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి ఎంపిడిఒ రామకృష్ణంరాజు, ప్రత్యేకాధికారి కుష్బుకొఠారి


తారాపురంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సమాధానం చెబుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని, మిగతావి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శంకరరావు, ఎఒ అనూరాధపండా, ఎలక్ట్రికల్ ఎఇ విజయ్‌కుమార్, ఎంఇఒ ఎ.తిరుమల ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కొటికిపెంటలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

సీతానగరం : మండలంలోని దయానిధిపురం, రంగంపేట, పణుకుపేట, కోటసీతారాంపురం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పార్వతీపురం ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. క్రిస్టమస్, సంక్రాంతి సందర్భంగా ప్రతి కుటుంబానికి పండుగ జరిపేందుకు చంద్రన్న కానుకలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. అలాగే ఉచిత వైద్య, పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ ఆధ్వర్యాన సీమంతాలు, అన్నప్రసన్న కార్యక్రమాలు కూడా చేశారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు కె.రత్నం, వై.సోములమ్మ, ఎంపిడిఒ ఎన్.పార్వతీశం, తహశీల్దార్ కె.అప్పలరాజు, ఎఒ ఎం.ఉమామహేశ్వరనాయుడు, టిడిపి నాయకులు కె.తిరుపతిరావు, కె.కిశోర్, కె.రామకృష్ణ, వై.రాధాకృష్ణ, ఎన్.సూర్యనారాయణతో పాటు వివిద శాఖాధికారులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటప్పలనాయుడు

117 మందికి ఉచిత కంటి పరీక్షలు

సీతానగరం : మండలంలోని పెదబోగిలి మేజరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీతానగరం ఆయకట్టు సంఘం అధ్యక్షులు టి.వెంకటప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామసర్పంచ్ బి.కృష్ణవేణి మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా ప్రజలు మెరుగైన సేవలు వినియోగించుకోవాలన్నారు. వైద్య శిబిరంలో 117 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37 మందికి ఆపరేషన్లు పడతాయని వైద్యులు తెలిపారు. ఈ ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి వైద్యులు డాక్టర్ ఉన్నతి, బిడిఒ మురళి, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య సంఘం అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, టిడిపి జిల్లా నాయకులు కె.కిశోర్, ఎస్.ప్రసాద్ పాత్రుడు పాల్గొన్నారు.

మరోసారి ప్రజల్ని మోసగించడానికే హామీలు

బొబ్బిలి టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇస్తున్న హామీలు మరోసారి ప్రజల్ని మరోసారి మోసగించడానికేనని సిపిఐ మండల కార్యదర్శి కోట అప్పన్న విమర్శించారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలకే అతీగతీ లేదని, ఇప్పుడేమో మరోసారి రాష్ట్ర ప్రజలను మాయమాటలతో మోసగించి అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ రంగానికి కేటాయించని నిధులు పెద్ద మొత్తంలో విద్యారంగానికి కేటాయిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ విద్యాసంస్థలకు రెడ్‌కార్పెట్ వేస్తూ ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ సిపిఐ సహాయ కార్యదర్శి పి.అశోక్, రామవరపు శకుంతల, ఆర్.నాగమ్మ, కె.అప్పన్న పాల్గొన్నారు.

వృద్ధునికి ఆర్థిక సాయం

బలిజిపేట : వృద్ధమిత్ర మండల అధ్యక్షులు మండల నారాయణరావు శనివారం ఓ వృద్ధుడికి ఆర్థిక సాయం అందించారు. స్థానిక మెట్టవీధికి చెందిన జాడ వెంకయ్య (80) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విధి నిర్వహణ కోసం అటువైపు వెళ్తున్న వృద్ధ మిత్ర అధ్యక్షులు నారాయణరావు ఆ వృద్ధుడ్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లి వైద్యం చేయించారు. అనంతరం ఆర్థిక సాయం చేసి మానవతా దృక్పదంతో చేసిన సేవకు ఆయన్ను పలువురు ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు ఆయన ఎన్నో ఇదివరకే చేశారు.


వృద్ధునికి ఆర్థిక సాయం అందజేస్తున్న వృద్ధ మిత్ర

శ్మశాన స్థలం కోసం బాహాబాహీ

ప్రత్యేకాధికారి, చైర్‌పర్సన్ సాక్షిగా ...

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్మశానం స్థలం కోసం తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరువర్గాలు బాహాబాహీకి దిగారు. శనివారం పట్టణంలో 21, 24 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమంలో 21వ వార్డు ఐటిఐ కాలనీకి చెందిన శ్మశాన వాటిక కోసం తెలుగుదేశం పార్టీలోని ఇరుగ్రూపుల వారు ఘర్షణకు దిగారు. శ్మశానవాటిక గతంలో ఐటిఐ కాలనీకి దగ్గర్లో ఉండేది. ఈ శ్మశానికి సమీపాన అపార్టుమెంటు నిర్మించడంతో 21వ వార్డుకు చెందిన కొంతమంది తెలుగుదేశం పెద్దలు శ్మశానాన్ని అపార్టుమెంటు యజమానికి అనుకూలంగా కాలనీకి దగ్గర్లో ఉన్న మరో గిరిజన కాలనీ దగ్గరకు శ్మశాన స్థలాన్ని మార్చారు. దీన్ని ప్రస్తుత కౌన్సిలర్ గ్రూపునకు చెందిన తెలుగుదేశం నాయకులు వ్యతిరేకిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జన్మభూమి కార్యక్రమంలో ఈ అంశం రావడం, చైర్‌పర్సన్ దీన్ని దాటవేసి జన్మభూమి కార్యక్రమం ముగించారు. జన్మభూమి సభలోనే ఇరుగ్రూపుల మధ్య తోపులాటలు, ఘర్షణ చోటు చేసుకుంది.

సమస్యలు తెలుసుకునేందుకే జన్మభూమి

సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తోందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి అన్నారు. శనివారం 21, 24వ వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బొబ్బిలి పర్యటనలో పట్టణానికి వరాలు ప్రకటించారని, ఇందులో భాగంగా ఇందిరమ్మ కాలనీకి రూ.17 కోట్లు మంజూరు చేశారని కాలనీ వాసులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. సదరం కార్యక్రమాన్ని బొబ్బిలిలో నిర్వహించాలని వికలాంగులు ఫిర్యాదు చేశారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రత్యేకాధికారికి చెప్పారు. పట్టణంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, అందుకు స్థలం నాయుడు కాలనీలో ఉందని, దీనికి కావాల్సిన కార్పస్ ఫండ్ రూ. 3 లక్షలు


జన్మభూమి సభలో ఒకరినొకరు తోసుకుంటున్న టిడిపి నాయకులు

తమసొంత నిధులు నుంచి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్కిల్, డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రత్యేకాధికారి దృష్టికి ఆమె తీసుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేకాధికారి గణపతిరావు, వైస్ చైర్మన్ సిహెచ్ రమేష్‌నాయుడు, కమిషనర్ హెచ్.శంకరరావు, కౌన్సిలర్ పార్వతి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, డిఇ మహేష్, వివిద శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్ ఫర్ సేవకు వితరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటలో ఎయిమ్‌ఫర్ సేవా బాలుర నిలయానికి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ తెంటు జయప్రకాష్ జ్ఞాపకార్థం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు శనివారం నెలకు కావాల్సిన బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వస్తువులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం అనాధ పిల్లలను ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌ఫర్ సేవా చిత్రాలయ మేనేజర్ సురేష్, తెంటు లక్షుంనాయుడు, తెంటు ఉషారాణి, పిల్లలు ఉన్నారు.


అనాథ పిల్లలతో తెంటు కుటుంబీకులు

వికలాంగుల సంక్షేమంపై సిఎం మాట్లాడకపోవడం అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలిటౌన్

పట్టణంలోని శుక్రవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వికలాంగుల సంక్షేమంపై మాట్లాడక పోవడం అన్యాయమని దివ్యాంగుల సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.త్రినాధరావు, బి.బాలరాజు అన్నారు. శనివారం ఆ సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కనీసం దివ్యాంగుల సమస్యలపై వినతి ఇవ్వడానికి అనుమతి ఇవ్వకపోవడం చూస్తే ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ రూ.3000 నుంచి రూ.5 వేలు వరకు పెంచాలని, ప్రతి నియోజకవర్గానికి వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన వికలాంగులకు పింఛన్లు, బ్యాంకు రుణాలు, అంత్యోదయ కార్డులు, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.ఎర్రయ్య పాల్గొన్నారు.

గత ఫిర్యాదుల సంగతేమిటి?

అధికారులను నిలదీసిన ప్రజలు, సిపిఎం నాయకులు



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సిపిఎం నాయకులు సీతారాం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గత జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదులకు ఇంత వరకూ పరిష్కారం లేదని, ఇప్పుడు మళ్లీ అర్జీలు తీసుకొని ఏం చేస్తారని మండలంలోని గడసింగిపురం గ్రామస్తులు, సిపిఎం నాయకులు సీతారాం అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కెవిఎస్ భాస్కరరావు అధ్యక్షతన జన్మభూమి గ్రామసభ జరిగింది. ఈసభలో జిఎస్ పురానికి చెందిన దళితులకు 1995లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 8.40 ఎకరాల భూమిని ప్రభుత్వం అందించగా, వీటికి సంబంధించి అడంగళ్ భూమి హక్కును ఇప్పించాలని అడిగినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇవ్వడంలేదని అధికారులను నిలదీశారు. ఇదిలా ఉండగా దంగభద్రలో స్థానిక సర్పంచి జోగి ప్రసాదమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కాలువల్లో పూడికతీలు తీయలేదని, వీధిలైట్లు ఆరునెలలుగా వెలగడంలేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనికి ఇఒపిఆర్‌డి సమాధానమిస్తూ త్వరలో ఎల్ఇడి లైట్లు వస్తాయని, అప్పటి వరకు తానే బల్బులు వేయొద్దని చెప్పినట్టు తెలపడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ నిధులను డ్రా చేసేందుకు వార్డు సభ్యులు సహకరించడం లేదని తెలిపారు. అలాగే గ్రామం కూడా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. అనంతరం పలు సమస్యలపై అధికారులకు ప్రజలు వినతులను అందజేశారు. సమావేశంలో జెడ్పీటిసి సభ్యులు డి.మంగమ్మ, ఎఎంసి మాజీ చైర్మన్ డి.రామకృష్ణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



బోయి, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దంటూ వినతులు ఇస్తున్న గిరిజనులు

ఇళ్ల బిల్లులు చెల్లించాలని నెల్లికిక్కువ గిరిజనులు ఆందోళన

గుమ్మలక్ష్మీపురం : ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు చెల్లిస్తేనే జన్మభూమి కార్యక్రమం నిర్వహించాలంటూ మండలంలోని డొంగరికిక్కువ గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని నెల్లికిక్కువ పంచాయతీలో ఎంపిడిఒ ఉమామహేశ్వరి ఆధ్వర్యాన జన్మభూమి-మాఊరు గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డొంగరికిక్కువ గ్రామస్తులు మాట్లాడుతూ తమ సమస్యలపై స్పందించకపోతే జన్మభూమి సభను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల ప్రత్యేకాధికారి బి.సుదర్శనదొర కలుగజేసుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు. అలాగే ఉపాధిహామీ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదని, ఇలా అయితే ఎలా బతకాలని వాడపుట్టి, డొంగరికిక్కువ, కొండకూనేరు, జోగిపురం గ్రామాల గిరిజనులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రత్యేకాధికారి స్పందిస్తూ సత్వరమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. బోయ, వాల్మీకిలను ఎస్టీలో చేర్చొద్దంటూ ఎపి గిరిజన సంఘం నాయకులు పి.తిరుపతిరావు, మండంగి శ్రీను, పలువురు గిరిజనులు నినాదాలు చేస్తూ వినతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.సాయమ్మ, జెడ్పీటిసి సభ్యులు ఎ.భాస్కరరావు, సర్పంచ్ పువ్వల శాంతకుమారి, జిసిసి మేనేజర్ ఎంవి రమణ, సిడిపిఒ జె.విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఎడిఎ శంకరరావు, వెలుగు ఎపిఎం త్రినాధమ్మ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ ఎన్వి రమణ ఆధ్వర్యాన రాయగడ జమ్ములో జరిగిన జన్మభూమి సభలో పలు సమస్యలపై గిరిజనులు అధికారులకు వినతులను అందజేశారు.

'సమస్యలు పరిష్కరించకుంటే అడ్డుకుంటాం'

కొమరాడ : మండలంలోని పెదశాఖ-మసిమండ పంచాయతీల్లో ఈనెల 9న జరగనున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని అడ్డుకుంటామని గ్రామస్తులు చెప్పారు. శనివారం వారు మండలంలోని కూనేరుసంతలో విలేకరుల వద్ద తమ సమస్యలను తెలిపారు. ఏళ్లతరబడి తమ గ్రామాలకు రోడ్డు సదుపాయంలేదని, దీనివల్ల బస్సు కూడా నిలపడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తాము సేకరించిన అటవీ ఫలసాయాలు, ఉత్పత్తులు తెచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై గతంలో పలు జన్మభూమి కార్యక్రమాలను అడ్డుకుని, అధికారులను నిలదీయగా చేస్తాం..చూస్తాం అని చెప్పి మాటదాటవేశారు తప్ప పనులు చేయడంలేదన్నారు. అలాగే గర్భిణులు, ఇతర రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. తమ సమస్యను పరిష్కరించిన తర్వాతే గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతిస్తామని, అంతవరకు అధికారులను రానివ్వమని తేల్చిచెప్పారు.



మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సన్యాసమ్మ

తోటపల్లిలో మంచినీటి పథకం ప్రారంభం

జియ్యమ్మవలస : గరుగుబిల్లి మండలంలో తోటపల్లిలో రూ.47వేలతో మంచినీటి పథకాన్ని నాబార్డు ఎజిఎం ఇ.శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు స్థానిక జట్టు ఆశ్రయం వ్యవస్థాపకులు డి.పారినాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ విషయాన్ని నాబార్డు ఎజిఎం దృష్టికి తీసుకురాగా ఆయన స్పందిస్తూ స్వచ్ఛందంగా రూ.47వేలు విరాళంగా అందజేశారు. దీంతో మినీ ఓవరహెడ్ ట్యాంకు నిర్మించారు. ఈ మేరకు శనివారం ఈ మంచినీటి పథకాన్ని పారినాయుడు తల్లి సనాసమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. నాబార్డు ఎజిఎం శ్రీనివాస్ ఉద్యోగోన్నతిపై ప్రస్తుతం రాయపూర్‌లో ఉన్నారు. తోటపల్లి గ్రామానికి తాగునీరందించిన శ్రీనివాస్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు

పార్వతీపురం : బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చొవద్దని మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు శశిభూషణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బిసి-ఎలో ఉన్న వీరిని ఎస్టీలోనికి చేర్చొవద్దని ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి, కేంద్ర గిరిజన తెగల కమిషన్ చైర్మన్‌కు లేఖల ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. బిసిలో ఉన్న 30లక్షల మంది జనాభాను ఎస్టీలో చేరిస్తే రిజర్వేషన్ల సమస్యలు వస్తాయని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శివాజీ కేవలం మూడు జిల్లాల్లోనే పర్యటించి ఇలా తప్పుడు నివేదిక ఇవ్వడం వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇక ప్రభుత్వం లోకూర్ కమిటీ సిఫార్సులు, సూచనలు పరిగణనలోనికి తీసుకోకుండా ఇలా నిర్ణయం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలో ఆర్టికల్ 341, 342లను ఉల్లంఘించి బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానించి, కేంద్రానికి నివేదిక పంపించిందని ఆయన చెప్పారు.

నేడు టెట్ శిక్షణకు ప్రవేశ పరీక్ష

పార్వతీపురం : ఐటిడిఎ ద్వారా టెట్ పరీక్షకు ఉచిత శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఆదివారం జరుగుతుందని గిరిజన సంక్షేమశాఖ డిడి వి.నారాయణుడు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం ఎవరైతే దరఖాస్తులు చేసుకున్నారో వారంతా స్థానిక వైటిసిలో మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలని సూచించారు. అలాగే ఉదయం 11 గంటల నుంచి పరీక్షా కేంద్రం వద్ద హాల్ టిక్కెట్లు ఇస్తామని, అభ్యర్థులు ఏదైనా గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : వైసిపి

గుమ్మలక్ష్మీపురం : దళితులపై దాడి చేసిన టిడిపి నాయకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు నిమ్మక గోపాల్, కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ డెంకాడ మండలం మోదవలసలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ఫిర్యాదులు ఇచ్చేందుకు వెళ్తున్న దళితులపై టిడిపి నాయకులు దాడికి పాల్పడ్డారన్నారు. అధికారం ఉందన్న అహంభావంతో దళితులపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంఇఒగా శ్రీనివాసరావు

జియ్యమ్మవలస : మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి ఎంఇఒగా పనిచేసిన ఎన్.నాగభూషణరావు కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

రైల్వే స్థలాలను ఖాళీ చేయాలి : డిఇ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ రైల్వేస్టేషన్ సమీపాన గల ఆక్రమిత నివేశస్థలాలను తక్షణమే ఖాళీ చేయాలని రైల్వే డిఇ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం పట్టణ రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉన్న పలువుర్ని ఖాళీ చేయాలని చెప్పేందుకు రైల్వే అధికారులు, ఆర్‌పిఎఫ్ పోలీసులు చేరుకోగా ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ అజురఫీజాన్, రెవెన్యూ సిబ్బంది, పట్టణ ఎస్ఐ ఎం.రాజేష్‌తో పాటు పోలీసు సిబ్బంది చేరుకున్నారు. అలాగే సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, నాయకులు, రైల్వే బోర్డు మెంబర్ ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యులు, పలు ప్రజా సంఘాల నాయకులు చేరుకుని అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రైల్వే డిఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు నెలల క్రితమే ఈ ప్రాంతంలో రైల్వే స్థలాన్ని ఖాళీ చేయాలని ఇక్కడి ప్రజలకు నోటీసులు అందించామని, వీరికి ఇచ్చిన గడువు పూర్తవ్వడంతో ఖాళీ చేయించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చామని తెలిపారు. వెంటనే ఖాళీ చేయకపోతే వీటిని తామే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో కొంతసేపు నివాసితులు, రైల్వే సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఇది రైల్వేశాఖ స్థలమైనప్పటికీ పండగముందు ఖాళీ చేయించడం వల్ల ఇబ్బందులపాలవుతారని, పండగ పూర్తయ్యే వరకూ గడువు ఇస్తే ఖాళీ చేస్తారని తహశీల్దార్, ఇతర అధికారులు చెప్పడంతో స్పందించిన రైల్వే అధికారులు ఈనెల 20లోగా ఖాళీ చేయాలని, లేకపోతే తాము తొలగించాల్సి ఉంటుందని తెలిపారు. రైల్వే అధికారుల హామీతో ఆందోళన సర్దుమణిగింది.



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న రైల్వేబోర్డు మెంబర్, ప్రజా సంఘాల నాయకులు.



పాఠశాలను పరిశీలిస్తున్న గిరిజన సంఘ నాయకులు

ఉపాధ్యాయుల్లేకుండా చదువెలా చెబుతారు?

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలలో కనీసం ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు లేకుండా విద్యార్థులకు చదువులు ఎలా చెబుతారని గిరిజన సంక్షేమ సంఘం, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు ప్రశ్నించారు. శనివారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'ఏకలవ్యకు ఉపాధ్యాయుల కరవు' అనే శీర్షికకు గిరిజన సంఘాలు స్పందించి ఆ పాఠశాలను శనివారం పరిశీలించాయి. ముందుగా అక్కడ ఉన్న ఇన్‌చార్జి వైస్‌ప్రిన్సిపల్‌తో మాట్లాడి ఉపాధ్యాయులు, సిబ్బంది, మౌలికసదుపాయాలు వంటివి లేకపోవడాన్ని గమనించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఏకలవ్య గురకుల పాఠశాలలు కేవలం ప్రచారానికే ప్రారంభించినట్లు కనిపిస్తుందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులుగానీ, పాఠ్యపుస్తకాలుగానీ లేకుండా విద్య ఎలా బోధిస్తారో చెప్పాల ప్రశ్నించారు. ఇప్పటికే గిరిజన విద్యారంగం నిర్వీర్యమవుతుందని, దీనికి తోడు ఇటువంటి ప్రచార ప్రారంభాలు చేస్తే గిరిజన విద్య మరింత నాశనమవుతుందని అన్నారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలో నడుస్తున్న కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక డిఎస్సీ ప్రకటించి, పోస్టులు భర్తీ చేయాలన్నారు. పాఠశాలను పరిశీలించిన వారిలో ఆ సంఘాల నాయకులు పి.రంజిత్‌కుమార్, శశిభూషన్, తదతర్లున్నారు.

18న బొబ్బిలి, సీతానగరం ఎంపిపి ఎన్నికలు

12న నోటిఫికేషన్ విడుదల

విజయనగరం : జిల్లాలో ఖాళీ అయిన బొబ్బిలి, సీతానగరం మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పదవుల భర్తీ కోసం ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తేదీలను వెల్లడించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ ఎంపిపి పదవుల ఎన్నికకు జనవరి 12న నోటిఫికేషన్ జారీ చేస్తారని, 18న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. సీతానగరం ఎంపిపి రాజీనామా చేయడం, బొబ్బిలి ఎంపిపి మృతితో అధ్యక్ష పదవులు ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు.

కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

విజయనగరం : జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో కంప్యూటర్ సహాయకునిగా పనిచేసేందుకు అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎ.గిరిధర్ తెలిపారు. మంచి ఆరోగ్యం, అలవాట్లు కలిగివుంటూ ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసే నిమిత్తం సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్‌లో వారికి గల నైపుణ్యాన్ని పరీక్షించేలా ఒక పరీక్ష నిర్వహిస్తారని, దీనితోపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తామని తెలిపారు. విజయనగరం పట్టణంలో నివసించే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. తుది ఎంపిక కోసం అభ్యర్థులు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానానికి హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో బయోడేటాను జనవరి 30లోగా జిల్లా జడ్జి, విజయనగరం వారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.17,500 పారితోషికంగా చెల్లిస్తారని తెలిపారు.

నేడు కేంద్రమంత్రి అశోక్ రాక

విజయనగరం : కేంద్ర మంత్రి పి.అశోక్‌గజపతిరాజు ఆదివారం జిల్లాకు రానున్నారు. సాయంత్రం 7.30 గంటలకు జిల్లా కేంద్రంలోని తన నివాసానికి చేరుకొని అధికార, అనధికారులను, ప్రజలను కలుస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. 8న సోమవారం ఉదయం 10 గంటలకు గరివిడి మండలం వెదుళ్లవలసలో జరిగే జన్మభూమి-మావూరు గ్రామసభలో పాల్గొంటారు. 9న మధ్యాహ్నం 4.30 గంటలకు విజయనగరంలో బయలుదేరి ఢిల్లీ చేరుకుంటారు.

నేడు అన్ని మండలాల్లో '5కె రన్'

కలెక్టర్ వివేక్ యాదవ్

విజయనగరం : ఐదోవిడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఐదు కిలోమీటర్ల పరుగును నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ తెలిపారు. జన్మభూమిలో ప్రజలంతా భాగస్వాములయ్యేందుకు వీలుగా జిల్లాలోని అన్ని మండలాలు, జిల్లా కేంద్రంలో ఉదయం 6.30 గంటలకు ఈ పరుగు ప్రారంభమవుతుందన్నారు.జిల్లా మంత్రి ఆర్.వి.సుజయ్‌కష్ణ రంగారావు ఈ పరుగులో పాల్గొంటారని పేర్కొ న్నారు. స్థానిక అయోధ్య మైదానం నుంచి ఈ పరుగు ప్రారంభమై కోట, మూడు లాంతర్ల కూడలి, కన్యకా పరమేశ్వరి ఆలయం, , రైల్వే స్టేషన్, మయూరి, బాలాజీ కూడళ్ల మీదుగా అయోధ్య మైదానానికి చేరుకుంటుందన్నారు. అనంతరం అదే చోట స్నేహపూర్వక కబడ్డీ పోటీ జరుగుతుందని, విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరుగులో విద్యార్థులు, యువత, పట్టణ ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్ని గ్రామాలకూ సిసి రోడ్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లాలో ఎన్‌ఆర్‌జిఎస్, పంచాయతీ నిధులు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం, 14వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వివేక్‌యాదవ్ తెలిపారు. వచ్చే ఏడాది నాటికి అన్ని గ్రామాలకు శతశాతం సిసి రోడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. శనివారం ఎస్.కోట మండలం కొత్తఊరులో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మౌలిక సదుపాయాలు అనే అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ జన్మభూమి, తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి సేకరించిన ఫిర్యాదులతో ఆర్థికేతర ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఆర్థిక సంబంధ ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లకు స్థలం లేని వారి కోసం రో టాయిలెట్లు, సామాజిక మరుగుదొడ్లు మంజూరు చేశామన్నారు. గ్రామాల్లో పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఒడిఎఫ్ ప్లస్‌కింద గ్రామాల్లో డోర్‌టు డోర్ చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించి ఎరువుగా మలచి అమ్మడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు.

గిరిజన విశ్వ విద్యాలయం స్థల సేకరణలో భూములు కోలోయిన వారికి ఇంటి పట్టాతో పాటు వ్యవసాయ భూమిని కూడా అందజేశామన్నారు. పార్లమెంట్ ఆమోదం పొంది విశ్వ విద్యాలయం నిర్మాణాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఎంఎస్‌ఎంఇ పార్కులు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తామన్నారు.

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ టిడిపి హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఒడిఎఫ్ కింద జిల్లా కలెక్టర్ చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ పేరును గిన్నిస్ బుక్ వేయించేందుకు కృషి చేశామన్నారు. ముందుగా కొత్తఊరులో ఇంటింటికీ కుళాయి నీటిని కలెక్టర్, ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో ముందుగా ఎన్‌ఆర్‌జిఎస్ కింద రోజుల పనిదినాలను పూర్తి చేసిన వేతనదారులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జెవి మురళి, మండల ప్రత్యేకాధికారి గణపతిరావు, జెడ్‌పిటిసి సభ్యులు రామలక్ష్మి, సర్పంచ్ జి.లక్ష్మి, ఎంపిడిఒ, తహశీల్దార్ పాల్గొన్నారు.

జన్మభూమిలో కలెక్టర్ వివేక్‌యాదవ్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు



ఆటలాడుతున్న విద్యార్థులు

11న భారీగా యూనిట్లు పంపిణీ

- జన్మభూమిలో సేవలందించిన వారికి అవార్డులు
- జిల్లా, మండల కేంద్రాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు
- జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఐదోవిడత జన్మభూమి కార్యక్రమం ముగింపు సందర్భంగా జనవరి 11న జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో పండగ వాతావరణంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజీ తెలిపారు. పలు ప్రభుత్వ శాఖలు, సంస్థల ద్వారా లబ్దిదారులకు యూనిట్ల పంపిణీకి కూడా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన్మభూమిలో సేవలందించిన పలువురికి అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు, కూచిపూడి నృత్యాలు తదితర కార్యక్రమాలు కూడా అన్ని చోట్లా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. బి.సి., ఎస్.సి., కాపు కార్పొరేషన్‌లతో పాటు మైనారిటీ కార్పొరేషన్, డిఆర్‌డిఎ సంస్థలు తమ పరిధిలోని పథకాలకు సంబంధించిన లబ్దిదారులకు ఆ రోజున యూనిట్లు అందించే ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. 2016-17, 2017-18 సంవత్సరాలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా అందజేయాల్సిన యూనిట్లను ఈ కార్యక్రమంలో అందజేయాలన్నారు. బిసి., ఎస్‌సి., కాపు కార్పొరేషన్‌ల ద్వారా 258 యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి బ్యాంకులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు, డి.ఆర్.ఒ. ఆర్.ఎస్. రాజ్‌కుమార్, సిపిఒ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ డి.డి. సునీల్ రాజ్‌కుమార్, జిల్లాపరిషత్ సిఇఒ టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీకేష్

ఉధృతమవుతున్న 'మిరాకిల్' గొడవ

- చిలికిచిలికి గాలివానలా విద్యార్థుల వివాదం
- మిరాకిల్ బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు
- చోద్యం చూస్తున్న యాజమాన్యం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులకు నచ్చచెబుతున్న పోలీసులు

ప్రజాశక్తి-భోగాపురం

మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల మధ్య జరిగిన గొడవ చిలిచిలికి గాలివానలా మారుతోంది. కొంత మంది విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాట చివరికి గ్రామాల్లో ప్రజలను వివాదంలోకి లాగింది. తాజాగా భోగాపురం మండల కేంద్రానికి చెందిన యువకులు శనివారం మిరాకిల్ కళాశాల విద్యార్థులు వెళ్లే బస్సులను అడ్డుకున్నారు. దీంతో విద్యార్థుల మధ్య జరిగిన చిన్న గొడవ పోలీసు స్టేషన్లు దాటి ఉధృతంగా మారుతోంది. గత కొద్ది రోజులుగా మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడుతున్నారు. దీంతో కొంతమంది గాయాపాలవుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. యాజమాన్యం మాత్రం గొడవలను నిలువరించడంలో విఫలమవుతోంది. శుక్రవారం ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.రాజు తనతో పాటు హర్ష, సాయిలపై సీనియర్ విద్యార్థులు దాడి చేశారని భోగాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి ప్రతిగా భోగాపురం గ్రామస్తులు గ్రామంలో నుండి కళాశాలకు వెళ్తున్న మిరాకిల్ వాహనాలను అడ్డుకుని యాజమాన్యం తీరుపై నిరసన తెలిపారు. చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులు ప్రాణాలు పోయేలా కొట్టుకుంటున్నా, యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే జరిగిన గొడవపై విచారణ జరిపి, యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గాయాలపాలైన విద్యార్థులు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల జోక్యం...

మిరాకిల్ వివాదంపై పోలీసులు జోక్యం చేసుకున్నారు. బస్సులను అడ్డుకున్న గ్రామస్తులను సముదాయించి, యాజమాన్యంతో మాట్లాడుతామని చెప్పడంతో వారు శాంతించారు. ఈ మేరకు సిఐ రఘువీర్‌విష్ణు యాజమాన్యానికి, విద్యార్థులకు మధ్య చర్చలు పెట్టి, పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించి, విద్యార్థులకు న్యాయం చేస్తామని చెప్పినట్లు తెలిసింది. కానీ దాడికి పాల్పడిన విద్యార్థులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.